సంక్షేమ

మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 02 ::: సంచిక:97
Vol-02 ::: Issue-97

హైదరాబాద్ 07 నవంబర్ 2026, శనివారం
Hyderabad 07 November 2026, Saturday

పేజీలు: 8, వెల: రూ. 5/-
Pages: 8, Rs. 5/-


అమెరికా మార్కెట్లు భారీ పతనం



అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అమెరికా స్టాక్ మార్కెట్లు నిలువునా కుప్పకూలాయి. ఫలితాల తర్వాత సంబరాలు చేసుకున్న మదుపర్లు తక్షణమే భారీ స్థాయిలో లాభాల స్వీకరణకు తెగబడటంతో సూచీలు క్రాష్ అయ్యాయి. ప్రధానంగా నాస్‌డాక్ ఏకంగా 5.52 శాతం పతనమై గత 19 నెలల్లోనే అత్యంత దారుణమైన రోజువారీ నష్టాన్ని చవిచూసింది.

...::: పూర్తి కథనం 7వ పేజీలో...

వేతనాల పెంపుపై కార్మికుల భారీ ర్యాలీ



పారిస్: వేతనాల పెంపు కోసం ఫ్రాన్స్‌లో కార్మికులు కదం తొక్కారు. లక్షలాది మంది రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులు కొంతకాలంగా కొనసాగిస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. పారిస్, లియోన్, మార్సెయ్ సహా దేశంలోని పలు ప్రధాన నగరాల్లో శుక్రవారం ఈ ర్యాలీలు జరిగాయి. దేశవ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది కార్మికులు పాల్గొన్నట్లు అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

ట్రంప్‌కు ఇరాన్ ఏడు డిమాండ్లు



ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిస్తున్న వేళ.. టెహ్రాన్ శాంతి చర్చలకు కొత్త ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. అమెరికాతో అణు చర్చలు జరపాలంటే తాము పంపిన ఏడు డిమాండ్లను అంగీకరించాల్సిందేనని స్పష్టం చేసింది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

సింధు జలాలపై పాక్ మళ్లీ బెదిరింపులు

సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని పాకిస్తాన్ జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశ రక్షణ శాఖమంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. సింధు జలాల విషయంలో పాకిస్తాన్ ప్రేక్షకపాత్రకే పరిమితం కాదని, అవసరమైతే ప్రతిస్పందనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇస్లామాబాద్ తనకున్న ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు.


...::: పూర్తి కథనం 3వ పేజీలో...

ప్రధానిగా ఐసెన్‌కోట్‌కు లైన్ క్లియర్

విపక్ష నేతకు అరబ్బు పార్టీల మద్దతు

67 మందికి పెరిగిన సభ్యుల బలం

కింగ్ మేకర్‌గా మారిన అరబ్బు కూటమి



...::: పూర్తి కథనం 3వ పేజీలో...

ఓట్ల చోరీ కాదు పౌరుల హక్కుల చోరీ

సంక్షేమ పథకాలకు ఓటర్ ఐడీ లింక్ పై రాహుల్ గాంధీ ఆగ్రహం

ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపణ

పేదవాడి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిసగా మార్చలేరని స్పష్టం

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్ కార్డుకు బదులుగా ఓటర్ ఐడీని అనుసంధానించాలన్న ప్రతిపాదనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఇది కేవలం ఓట్ల చోరీ మాత్రమే కాదని, పౌరుల ప్రాథమిక హక్కులను హరించే ప్రయత్నమని ఆరోపించారు. ఓటర్ల జాబితాను తమకు అనుకూలంగా మార్చుకుని, అదే జాబితా ఆధారంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలా వద్దా అని నిర్ణయించే కుట్ర జరుగుతోందని రాహుల్ విమర్శించారు.



న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

ఈ విధానం అమల్లోకి వస్తే పేదల పెన్షన్లు, రేషన్, ఉపాధి హామీ వంటి ప్రయోజనాలు కూడా ఓటు హక్కుతో ముడిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ గాంధీ పోస్టు చేశారు. గల్లీకో సంస్థ ఐదు నిమిషాల్లో ఆధార్ కార్డులు తయారు చేసి ఇస్తోందని, అందుకే ఆధార్‌కు బదులుగా బయోమెట్రిక్, ఓటర్ ఐడీ ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కేంద్రమంత్రి లలన్‌సింగ్ వ్యాఖ్యానించిన వీడియోను రాహుల్ పంచుకున్నారు. ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. బీజేపీని ఓడించాలని భావించే వారి పేర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఓటరు జాబితా నుంచి పేరు తొలగితే ఓటు హక్కు కోల్పోతారని, తద్వారా ఇతర హక్కులపైనా ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజాస్వామ్య వ్యవస్థ స్థానంలో, ప్రభుత్వమే తనకు అనుకూలమైన ప్రజలను ఎంపిక చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు.


...::: తరువాయి 2వ పేజీలో...

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై దిద్దుబాటు

ముసాయిదా జాబితాలో పేరు గల్లంతైన వారికి ఈసీ ఊరట

తెలంగాణ, ఏపీ సహా ఏడు రాష్ట్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ఇంటింటికీ వెళ్లి గుర్తించాలని అధికారులకు ఆదేశాలు



న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఎన్యూమరేషన్ ఫారాలు అందకపోవడం, సకాలంలో తిరిగి సమర్పించకపోవడం వంటి కారణాలతో జాబితాలో పేరు కోల్పోయిన అర్హులైన ఓటర్లు తుది జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో ఈ నిర్ణయం అమలు చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

...::: తరువాయి 2వ పేజీలో...

గ్లోబల్ ఐటీ హబ్‌గా హైదరాబాద్



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. న్యూయార్క్ కేంద్రంగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాఫ్ట్ వేర్, డేటా, అనలిటిక్స్ సేవలు అందించే ప్రముఖ 'పికో టెక్నాలజీ' ఇండియా నూతన కార్యాలయాన్ని హైటెక్ సిటీలో మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గ్లోబల్ కంపెనీలు తమ కీలక పరిశోధనలు, కార్యకలాపాలు ఉత్పత్తుల అభివృద్ధికి హైదరాబాద్‌ను ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకునేలా అన్ని అనుకూల వాతావరణాలను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

అతివృష్టి, అనావృష్టి కాదు... ఇది సర్కార్ సృష్టి



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన అనలోచిత కరువు అని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఇది అతివృష్టి, అనావృష్టి కాదని, కేవలం 'రేవంత్ సృష్టి' మాత్రమేనని ఆయన అభివర్ణించారు. నదులలో కావలసినంత నీటి లభ్యత ఉన్నప్పటికీ, పంపులు నడిపి నీళ్లను ఎత్తిపోసే చేతకానితనాన్ని ఈ ప్రభుత్వం ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో ఆధారాలతో సహా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలతో సరిపెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకు వదిలేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ నీటిని ఒడిసి పట్టుకున్నారని పేర్కొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...



ప్రశ్నించే హక్కును కాలరాస్తే చూస్తూ ఊరుకోం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకుడిని అరెస్ట్ చేస్తారా అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టును ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదని సూచించారు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్ ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమని కేటీఆర్ పేర్కొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...



ప్రధాని మోదీతో మాజీ టీ20 కెప్టెన్

ప్రపంచకప్ పతకాన్ని పరిశీలించిన ప్రధాని

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భారత క్రికెట్ జట్టు మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఢిల్లీలో శుక్రవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాని నివాసానికి వెళ్లిన ఆయనతో మోదీ ఆప్యాయంగా మాట్లాడారు. సూర్యకుమార్ పిల్లలు రామ్, సరయూలతోనూ కొంతసేపు సరదాగా గడిపారు. తర్వాత ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను ప్రధాని 'ఎక్స్'లో పంచుకున్నారు. దీపావళి వేళ రామ్, సరయూల రాకతో పండుగ వాతావరణం మరింత పవిత్రంగా, దివ్యంగా మారిందని మోదీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సూర్యకుమార్ టీ20 ప్రపంచకప్ విజయానికి గుర్తుగా అందుకున్న బంగారు పతకంతో కనిపించారు. దాన్ని ప్రధాని చేతిలోకి తీసుకుని పరిశీలించారు. చారిత్రక విజయానికి సూర్యకుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం



- మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- ఒకే సీజన్‌లో రెండు తుపాన్లు రావడం తొలిసారి
- నీటి భద్రతకు ప్రాధాన్యం
- దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన
- బాపట్ల,గుంటూరు జిల్లాల్లో సీఎం ఏరియల్ సర్వే

గుంటూరు (ఏడీఎన్ఎన్) :

కోస్తా ప్రాంతాలను వరుస తుపాన్లు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని, నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మురసు తుపాను ధాటికి నీటమునిగిన బాపట్ల, గుంటూరు జిల్లాల్లో శుక్రవారం ఆయన ఏరియల్ సర్వే నిర్వహించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సూర్యాపేట (ఏడీఎన్ఎన్) :

గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినప్పటికీ, తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ ద్వారా రాష్ట్ర ప్రజలకు నీళ్లు అందించిందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. సూర్యాపేట జిల్లా పర్యటనలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, తర్వాత మీడియాతో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావాన్ని కూడా ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు వదిలేసి నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

1,718 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మదుపర్లకు కంటిమీదుపుతోనే లాభాల పండుగను మోసుకొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ, మన సూచీలు వాటిని అధిగమించి వరుసగా ఏడో రోజు భారీ లాభాల్లో ముగిశాయి.

...::: పూర్తి కథనం 7వ పేజీలో...

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
07.11.2026
www.manasarkar.com

ప్రధాని మోదీతో మాజీ టీ20 కెప్టెన్

మొదటిపేజీ తరువాయి....

కెప్టెన్సీ మార్పు వేళ భేటీ ..

టీ20 ఫార్మాట్‌లో సూర్యకుమార్ అద్భుతమైన రికార్డు సాధించారు. 2022, 2023లో వరుసగా ఐసీసీ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు అందుకున్నారు. అయితే ఇటీవల బ్యాటింగ్ ఫామ్ తగ్గడంతో ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కలేదని సమాచారం. అతడి స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను కొత్త టీ20 కెప్టెన్‌గా నియమించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీతో సూర్యకుమార్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

మొదటిపేజీ తరువాయి....

అమరావతి నుంచి హెలికాప్టర్ ద్వారా పంట నష్టాన్ని పరిశీలించిన సీఎం, తర్వాత సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో దిగి రోడ్డు మార్గాన బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు చేరుకున్నారు. తుపాను వర్షాలకు గండ్లు పడిన ప్రధాన డ్రెయిన్లను నిశితంగా పరిశీలించి, వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చేరుకుని, నీటమునిగిన వరి పొలాల్లో స్వయంగా పర్యటించి నష్టపోయిన రైతులతో ముఖాముఖి మాట్లాడి ధైర్యం చెప్పారు.పంట పొలాల పరిశీలన తర్వాత సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. మురసు, అర్నబ్ తుపాన్ల కారణంగా గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సీజన్‌లో వరుసగా రెండు తుపాన్లు రావడం రాష్ట్ర చరిత్రలో నే ప్రథమం అని పేర్కొన్నారు. తుపాను తీవ్రతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారని, కేంద్రానికి ఎప్పటికప్పుడు ప్రాథమిక నష్టపరిహార నివేదికలను పంపుతున్నామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో నష్టపోయిన చివరి బాధితుడికి సాయం అందే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేసుకోవాలని, నల్లమడ డ్రెయిన్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జలవనరుల వ్యవస్థ పూర్తిగా విధ్వంసమైందని సీఎం ధ్వజమెత్తారు. గత పాలకులు తుపాన్ల వేళ రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వానికి ఎన్నికల కంటే ప్రజా సమస్యలే ప్రాధాన్యమని, అందుకే కష్టకాలంలో నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. కోస్తా తీర ప్రాంతాలను తుపాన్లు ముంచెత్తితే, రాయలసీమను ఎల్‌నినో కరువు దెబ్బతీసిందని.. అందుకే సముద్రంలోకి వృథాగా పోయే నీటిని నిల్వ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమర్థ నీటి నిర్వహణ, నీటి భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మిగిలిన రాజకీయ అంశాలపై మాట్లాడతానని ఆయన స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి....

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ పార్టీ ప్రభంజనమే ఉంటుందని, మళ్లీ అధికారంలోకి వచ్చేది తమ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. స్వతంత్ర భారతదేశంలో మరే రాష్ట్రంలోనూ జరగని రీతిలో తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు.

ప్రశ్నించే హక్కును కాలరాస్తే చూస్తూ ఊరుకోం

మొదటిపేజీ తరువాయి....

అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని.. బాలరాజు యాదవ్ పై కేసును తక్షణమే ఉపసంహరించుకుని బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్ట్ ను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఖండించారు.. తక్షణమే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలు నిరాధారమైన వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ప్రశ్నించిన దూదిమెట్ల అరెస్ట్ చేయడం అక్రమమని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య బద్ధంగా విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని ఆయన పేర్కొన్నారు.బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో తప్పుడు ఆరోపణలను ప్రశ్నించడం, ఖండించడం నేరమా? అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.



అతివృష్టి, అనావృష్టి కాదు... ఇది సర్కార్ సృష్టి

మొదటిపేజీ తరువాయి....

శ్రీశైలంలో సరిపడా నీళ్లు ఉన్నప్పటికీ కల్వకుర్తి ఎత్తిపోతల వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నపడంలో ప్రభుత్వం విఫలైందని, మరోవైపు చంద్రబాబు నాయుడు ఏకంగా 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని గుర్తుచేశారు. గ్లోబల్ వార్మింగ్, 'ఎల్ నినో' ప్రభావం వస్తుందని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో పంటల బీమా గురించి గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేయడం మరచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాల పంటల బీమా ఉండి ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని, పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో తక్షణ కరువు సాయం కింద ఎకరానికి రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని ఉదాహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 లక్షల ఎకరాలలో పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే, కనీసం కేబినెట్ మీటింగ్‌లో కూడా దీనిపై చర్చించకపోవడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నేడు తెలంగాణ వ్యాప్తంగా పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు దాపురించాయని హరీశ్ రావు స్పష్టం చేశారు.

ఓబీసీ క్రీమీలేయర్‌పై సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :



ఓబీసీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిర్ధారణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. తల్లిదండ్రుల జీతాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని అభ్యర్థులను క్రీమీలేయర్ పరిధిలోకి చేర్చకూడదని గతంలో ఇచ్చిన తీర్పు అమలుపై తాజాగా వివరణ ఇచ్చింది. ఇప్పటికే పూర్తయిన ఉద్యోగ నియామకాలు, ఎంపికలు, పదోన్నతులు, సీనియారిటీపై ఈ తీర్పు ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. అయితే సర్వీసుల కేటాయింపు ఇంకా పూర్తికాని సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025 అభ్యర్థులకు మాత్రం తాజా మార్గదర్శకాలు వర్తిస్తాయని తెలిపింది. దీంతో పాత నియామకాలకు రక్షణ లభించగా, భవిష్యత్తు నియామకాల్లో క్రీమీలేయర్ నిర్ధారణకు స్పష్టత ఏర్పడింది.

జీతం ఒక్కటే ప్రామాణికం కాదు...

ఓబీసీ క్రీమీలేయర్ నిర్ణయంలో తల్లిదండ్రుల ఆదాయాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చి 11న ఇచ్చిన తీర్పులో పేర్కొంది. తల్లిదండ్రులు ప్రభుత్వంలో ఏ హోదాలో పని చేశారు? వారి పోస్టు ఏ కేటగిరీకి చెందుతుంది? వంటి అంశాలను పరిశీలించాలని స్పష్టం చేసింది. 1993 ఆగస్టు 8న కేంద్రం జారీ చేసిన ఆఫీస్ మెమొరాండం ప్రకారమే అర్హతను నిర్ణయించాలని తెలిపింది. 2004లో ఇచ్చిన వివరణాత్మక లేఖ ఆధారంగా అప్పటి నిబంధనల్లో లేని కొత్త అర్హతలను చేర్చడానికి వీల్లేదని పేర్కొంది. ఆదాయం, ఆస్తుల ఆధారంగా పరిశీలించే సందర్భాల్లో జీతం, వ్యవసాయ ఆదాయాలను లెక్కలోకి తీసుకోరాదని వివరించింది.

పాత నియామకాలకు రక్షణ ...

తీర్పు అమలుపై కేంద్ర ప్రభుత్వం వివరణ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇప్పటికే పూర్తయిన నియామకాలు, విద్యా ప్రవేశాలు, పదోన్నతులపై దీన్ని వెనక్కి వర్తింపజేస్తే పరిణామాలు ఎదురవుతాయని వాదించింది. ఉద్యోగుల సీనియారిటీ, సర్వీసు నిబంధనలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఇప్పటికే పూర్తయిన నియామకాలు, ఎంపికలు, పదోన్నతులు, సీనియారిటీని తిరిగి తెరవడానికి ఈ తీర్పును ఆధారంగా చేసుకోరాదని స్పష్టం చేసింది. అయితే న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను వాటి మెరిట్స్ ఆధారంగా నిర్ణయించవచ్చని తెలిపింది.

సివిల్స్-2025 అభ్యర్థులకు వర్తింపు...


సివిల్ సర్వీసెస్ పరీక్ష2025 ద్వారా 958 మంది ఎంపికైనప్పటికీ, వారికి సర్వీసుల కేటాయింపు ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. అందువల్ల ఈ అభ్యర్థులకు మార్చి 11నాటి తీర్పు వర్తిస్తుందని స్పష్టం చేసింది. వారి క్రీమీలేయర్ అర్హతను తాజా మార్గదర్శకాల ప్రకారమే నిర్ణయించాలని తెలిపింది.

కొత్త విధానంపై కేంద్రానికి స్వేచ్ఛ..

ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారి పిల్లలకూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన హోదా ఆధారంగా నిబంధనలు వర్తింపజేయాలని కోర్టు అభిప్రాయపడింది. ఏయే పోస్టులను సమాన హోదాలుగా పరిగణించాలి? వాటిని ఎలా వర్గీకరించాలి? అనే అంశాలపై కొత్త విధానం రూపొందించుకునే స్వేచ్ఛ కేంద్రానికి ఉందని పేర్కొంది. రెండేళ్ల గడువు విధించాలన్న కేంద్రం అభ్యర్థనను అంగీకరించలేదు. మార్చి 11, 2026 తర్వాత చేపట్టే నియామకాలు, ఎంపికలు, రోస్టర్ పాయింట్ల కేటాయింపుల్లో తాజా మార్గదర్శకాలను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :



కృత్రిమ మేధ (ఏఐ), సెమీకండక్టర్ రంగాల్లో ప్రపంచస్థాయి శక్తిగా ఎదిగేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశాన్ని ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వెల్లడించారు. వ్యవసాయం, వైద్యం, విద్య వంటి కీలక రంగాల్లో ఆచరణాత్మక ఏఐ నమూనాల వినియోగాన్ని విస్తరించనున్నట్లు చెప్పారు. ఢిల్లీలో సెమికాన్ 2.0 వెబ్ అప్లికేషన్ పోర్టల్‌ను శుక్రవారం ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడారు. దేశీయ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

ఏఐ వినియోగంలో భారత్ ముందంజ ...

ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిశ్రమలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని మంత్రి అన్నారు. పంటల నిర్వహణ, వైద్య సేవలు, బోధనా విధానాల్లో ఏఐ వినియోగానికి భారత్‌లో అపార అవకాశాలున్నాయని వివరించారు. ఈ రంగాల్లో దేశీయ పరిశ్రమలు ఇప్పటికే మంచి పురోగతి సాధిస్తున్నాయని తెలిపారు. విదేశీ సంస్థలతో పోటీపడుతూ, భారత అవసరాలకు అనుగుణమైన ఏఐ అప్లికేషన్లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్లు చెప్పారు.

అసంపూర్తి దరఖాస్తులకు చోటు లేదు ...

సెమికాన్ 2.0 పోర్టల్ ద్వారా పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామని అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. సెమీకండక్టర్ రంగంలో నిజంగా పెట్టుబడులు పెట్టి ప్రాజెక్టులను అమలు చేయాలనే ఆసక్తి ఉన్న సంస్థలకే అవకాశం కల్పిస్తామన్నారు. అసంపూర్తి దరఖాస్తులను అంగీకరించబోమని, అనర్హమైన 18-19 సంస్థలను తొలగించాలని ఐటీ కార్యదర్శిని ఆదేశించినట్లు వెల్లడించారు. దేశీయంగా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ) చిప్ అభివృద్ధికి సంబంధించిన రోడ్‌మ్యాప్ కూడా తుది దశకు చేరుకుందని తెలిపారు.

రూ.7,500 కోట్లతో 12 ప్రాజెక్టులు ..

ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఈసీఎంఎస్) కింద మరో 12 దరఖాస్తులకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల విలువ రూ.7,500 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, ముడి పదార్థాలు, తయారీ యంత్రాలు, పరికరాల ఉత్పత్తికి సంబంధించిన యూనిట్లు ఇందులో ఉన్నాయని వివరించారు. ఆమోదం పొందిన సంస్థల్లో సగం వరకు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎస్ఎంఈలు), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈలు)కు చెందినవేనని మంత్రి పేర్కొన్నారు.

అసెంబ్లింగ్ నుంచి విడిభాగాల తయారీ వరకు...

భారత్‌లో మొబైల్ ఫోన్ల తయారీ ప్రారంభమైనప్పుడు కేవలం అసెంబ్లింగ్‌కే పరిమితమవుతుందని విమర్శలు వచ్చాయని అశ్విని వైష్ణవ్ గుర్తుచేశారు. ఇప్పుడు మాడ్యూళ్లు, విడిభాగాలు, ముడి పదార్థాల తయారీ వరకు దేశీయ పరిశ్రమలు విస్తరించాయని చెప్పారు. ఇదే తరహాలో సెమీకండక్టర్ రంగంలోనూ స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

సోషల్ మీడియా సంస్థలకు సూచనలు...

పిల్లలు, మహిళల భద్రతకు సోషల్ మీడియా సంస్థలు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర మంత్రి సూచించారు. డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఇతర ఆన్‌లైన్ నేరాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించే సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పారు. బాధితులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా ఫిర్యాదు చేసి పరిష్కారం పొందే విధానం అందుబాటులోకి రావాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు.

భార్యపై కక్షతో ఏడుగురి దారుణ హత్య

బెంగళూరు (ఏడీఎన్ఎన్) :



భార్య తరచూ పుట్టింటికి వెళ్తోందన్న కోపం ఒక వ్యక్తిని కిరాతకుడిగా మార్చింది. తనతో గొడవలకు అత్తింటివారే కారణమని భావించిన ఓ క్యాబ్ డ్రైవర్.. భార్యతో పాటు ఆమె కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య ఘటన బెంగళూరులో తీవ్ర కలకలం రేపింది. రెండ్రోజుల వ్యవధిలో జరిగిన ఈ ఘోరంలో ఏడేళ్ల బాలుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. నిందితుడు ఇందూశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఈ హత్యల విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

20 ఏళ్ల వైవాహిక బంధంలో కలహాలు...

ఇందూశేఖర్, సునీతలకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే సునీత తరచూ పుట్టింటికి వెళ్లడం, ఆమె తల్లి, సోదరులు అందుకు మద్దతుగా నిలవడంతో దంపతుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. కుటుంబ పెద్దలు పలుమార్లు పంచాయితీలు నిర్వహించి సర్దిచెప్పినా గొడవలు తగ్గలేదు. అత్తింటివారే తమ కాపురంలో చిచ్చు పెడుతున్నారని భావించిన ఇందూశేఖర్ వారిపై కక్ష పెంచుకున్నాడు.

రోకలిబండతో దాడి.. వరుస హత్యలు...

పోలీసుల కథనం ప్రకారం.. ముందుగా భార్య సునీతను రోకలిబండతో తలపై కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని గుడ్డలో చుట్టి నంది హిల్స్ సమీపంలో పడేశాడు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, పర్యటనకు వెళ్లిందని పొరుగువారిని నమ్మించాడు. మరుసటి రోజు బావమరుదులు శివకుమార్, శంకర్‌లను పార్టీ పేరుతో ఇంటికి పిలిచి హత్య చేశాడు. తర్వాత వారి భార్యలు దివ్య, నళిని, అత్త రూపవతి, ఏడేళ్ల బాలుడు పునీత్‌ను కూడా హతమార్చినట్లు విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది.

మృతదేహాల కోసం గాలింపు...

హత్యల ఆనవాళ్లు చెరిపేసేందుకు ఇంటిని రసాయనాలతో శుభ్రం చేసి, రక్తపు మరకలను తొలగించినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాలను తరలించేందుకు కారును ఉపయోగించినట్లు అనుమానిస్తున్నారు. నిందితుడి కుమార్తెకు ఈ ఘటనలో ఏమైనా సంబంధం ఉందా? మృతదేహాల తరలింపులో ఆమె సహాయం తీసుకున్నాడా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నళిని తల్లి శ్రీరాంపుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. నిందితుడి సమాచారంతో నంది హిల్స్ పరిసరాల్లో గాలించిన పోలీసులు బాలుడు పునీత్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మిగిలిన ఆరుగురి మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ హత్యల్లో మరెవరికైనా ప్రమేయం ఉందా? నివాస ప్రాంతంలో ఇంతటి ఘోరం జరిగినా విషయం బయటకు రాకపోవడానికి కారణాలేమిటి? అనే అంశాలపై పోలీసులు విచారిస్తున్నారు.

ఎన్డీఏ కోసం సోనియా ఓట్ల చోరీకి పాల్పడ్డారా?

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :



కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ల చోరీ ఆరోపణలపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం ఎన్డీఏకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్న రాహుల్ ఆరోపణలను గణాంకాలతో తిప్పికొట్టారు. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో సీఈసీగా పనిచేసిన వీఎస్ సంపత్ కాలంలోనే ఎన్డీఏ గెలుపు శాతం ఎక్కువగా ఉందని గుర్తుచేశారు. అప్పట్లో సోనియా గాంధీ ఎన్డీఏ కోసం ఓట్ల చోరీకి పాల్పడ్డారా? అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. వీఎస్ సంపత్ 2012 జూన్ నుంచి 2015 జనవరి వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఎన్డీఏ గెలుపు శాతం 75గా ఉండగా, ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ హయాంలో అది 66 శాతానికి పడిపోయిందని భండారీ పేర్కొన్నారు. సంపత్ హయాంలోనే బీజేపీ స్ట్రైక్ రేట్ అధికంగా ఉందని వివరించారు. జ్ఞానేశ్ కుమార్ 2024 మార్చిలో సీఈసీగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎన్డీఏకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్న నేపథ్యంలో భండారీ ఈ గణాంకాలను ప్రస్తావించారు. రాహుల్ వాదనల ప్రకారం చూస్తే, యూపీఏ పాలనలో సీఈసీగా ఉన్న వీఎస్ సంపత్ సమయంలో ఎన్డీఏ సాధించిన అధిక విజయాలకూ ఓట్ల చోరీ కారణమని అనుకోవాలా? అంటూ ఎద్దేవా చేశారు. వాస్తవ గణాంకాలు రాహుల్ గాంధీ ఆరోపణలకు భిన్నంగా ఉన్నాయని భండారీ పేర్కొన్నారు.



ఢిల్లీలో వాయు కాలుష్యంపై గ్రాప్-3 ఆంక్షలు

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

దేశ రాజధాని ఢిల్లీతో పాటు జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. దీపావళి పండుగ వేళ గాలి నాణ్యత మరింత క్షీణించే అవకాశముండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) మూడో దశ ఆంక్షలను అమల్లోకి తెస్తున్నట్లు ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ప్రకటించింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 382కు చేరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏక్యూఐ 301-400 మధ్య ఉంటే గాలి నాణ్యత చాలా అధ్వానంగా ఉన్నట్లు పరిగణిస్తారు. పరిస్థితి మరింత దిగజారే సూచనలు కనిపించినప్పుడు గ్రాప్3 ఆంక్షలు విధిస్తారు. ఇందులో భాగంగా బీఎస్3, అంతకంటే పాత ప్రమాణాల పెట్రోల్ కార్లు, బీఎస్4, అంతకంటే పాత ప్రమాణాల డీజిల్ కార్ల రాకపోకలపై పరిమితులు ఉంటాయి. అత్యవసరం కాని నిర్మాణ, కూల్చివేత పనులపై నిషేధం విధిస్తారు. కంకర రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి రవాణాను నిలిపివేస్తారు. స్టోన్ క్రషర్లు, గనుల తవ్వకాలను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తారు. దీపావళి వేడుకలతో కాలుష్యం మరింత పెరిగే ప్రమాదం ఉండటంతో ప్రజలు, సంబంధిత సంస్థలు నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై దిద్దుబాటు

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ, మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్, నాగాలాండ్ రాష్ట్రాలకూ ఇది వర్తించనుంది. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడటంతోపాటు, నకిలీ, డూప్లికేట్ ఓట్లు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

ఇంటింటికీ వెళ్లి గుర్తించాలి ...

ముసాయిదా జాబితాలో పేర్లు లేని ఓటర్లను గుర్తించేందుకు బూత్‌ల వారీగా ప్రత్యేక జాబితాలను రూపొందించాలని ఈసీ స్పష్టం చేసింది. పేర్లు తొలగించడానికి గల ప్రాథమిక కారణాలను కూడా అందులో పొందుపరచాలని పేర్కొంది. ఈ జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించడంతో పాటు, రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. పేర్లు కోల్పోయిన వారికి కొత్త ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని తెలిపింది. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి వారిని సంప్రదించాలని సూచించింది. వాట్సాప్, ఈమెయిల్, ఎస్ఎంఎస్ వంటి మార్గాల్లోనూ సమాచారం చేరవేయాలని స్పష్టం చేసింది.

చిరునామా మారితే ఆధారాలు ఇవ్వాలి..

గతంలో ఉన్న నివాసంలోనే కొనసాగుతూ, ఫారం అందకపోవడం వల్ల పేరు తొలగిపోయినవారు తిరిగి ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి. గతంలో ఫారం ఎందుకు అందించలేకపోయారో వివరిస్తూ ఓ ప్రకటన జతచేస్తే సరిపోతుందని ఈసీ తెలిపింది. రాష్ట్రంలోని మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్నవారు ప్రత్యేకంగా ఫారం 8 సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొంది. కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు, చిరునామా ధ్రువీకరణ పత్రాలను ఎన్యూమరేషన్ ఫారంతోపాటు అందించాలని సూచించింది. నిరాశ్రయులైన ఓటర్లకు చిరునామా ధ్రువీకరణ పత్రాలు లేకపోతే, బీఎల్ఓ క్షేత్రస్థాయిలో నిర్వహించే పరిశీలన నివేదికనే నివాస ధ్రువీకరణగా పరిగణిస్తారు. వచ్చిన దరఖాస్తులను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారు.

ఈసీది యూటర్న్: కాంగ్రెస్

తాజా నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ.. దీన్ని ఎన్నికల సంఘం తీసుకున్న 'యూటర్న్'గా అభివర్ణించారు. ఓటు చోరీకి ఎస్ఐఆర్ కొత్త రూపమని, విమర్శలు వెల్లువెత్తడంతో తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఈసీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ద్వయం ఒత్తిడితోనే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులైన కోట్లాది మంది పేర్లను తొలగిస్తున్నారని ప్రతిపక్షాలు గత కొంతకాలంగా ఆరోపిస్తున్నాయి. ఈ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎస్ఐఆర్ చట్టబద్ధంగానే జరుగుతోందని, సుప్రీంకోర్టు సైతం ఈ ప్రక్రియను ధ్రువీకరించిందని ఎన్నికల సంఘం తన చర్యలను సమర్థించుకుంటోంది. తాజా నిర్ణయంతో ఓటర్ల జాబితాలో పేరు కోల్పోయిన అర్హులకు తిరిగి అవకాశం లభించనుంది.

గ్లోబల్ ఐటీ హబ్‌గా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

ఈ ఏడాది ప్రారంభంలో పికో సంస్థ ప్రతినిధులతో జరిగిన పెట్టుబడుల చర్చలు ఇప్పుడు కార్యరూపం దాల్చడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. రాబోయే ఏడాది కాలంలో హైదరాబాద్‌లోనే 100 కొత్త జీసీసీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. వీటిని కేవలం సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , సైబర్ సెక్యూరిటీ, ప్రాడక్ట్ డెవలప్‌మెంట్, ఇంజనీరింగ్, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో గ్లోబల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాల్లో విస్తరించి 350కి పైగా ప్రముఖ సంస్థలకు సేవలందిస్తున్న పికో టెక్నాలజీ హైదరాబాద్‌కు రావడం ద్వారా స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు మెండుగా లభిస్తాయని పేర్కొన్నారు.



ఓట్ల చోరీ కాదు పౌరుల హక్కుల చోరీ

మొదటిపేజీ తరువాయి...

పెన్షన్ ఓటర్ కార్డుకు బానిస కాకూడదు...

ప్రస్తుతం పంచాయతీరాజ్ పథకాలతో మొదలుపెట్టి భవిష్యత్తులో రేషన్, పెన్షన్లు, ఉపాధి హామీ, ఇళ్లు, ఉపకార వేతనాలు, రిజర్వేషన్లకూ ఓటర్ ఐడీని ప్రామాణికంగా చేస్తారా? అని రాహుల్ ప్రశ్నించారు. పేదవాడి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిసగా మార్చలేరని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలవడానికి చేసే రాజకీయాలకంటే, ఎన్నికల వ్యవస్థనే తమకు అనుకూలంగా మార్చుకునే శాశ్వత ప్రయత్నం ఇందులో దాగి ఉందని ఆరోపించారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, కానీ ప్రస్తుతం ఓటర్ల జాబితాల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై కూడా ఆయన ఆరోపణలు చేశారు. ఈ హక్కుల హరణను కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు.

కాలుష్యంపై జైరాం ఆందోళన ..

మరోవైపు దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్రరూపం దాలుస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) విశ్లేషణ ప్రకారం కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్య సంక్షోభం మరింత తీవ్రమవుతోందని ఆయన తెలిపారు.

అప్పుల ఊబిలో సామాన్యులు ...

నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. కూరగాయలు, పండ్లు, పప్పులు, వంటనూనె, పాలు, పిండి ధరల పెరుగుదల పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారంగా మారిందని జైరాం రమేశ్ విమర్శించారు. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రజలు ద్రవ్యోల్బణం, అప్పుల ఊబిలో చిక్కుకున్నారని ఆరోపించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో బీజేపీని ఓడించడం ద్వారా పెరుగుతున్న ధరలపై ప్రజలు తమ నిరసనను తెలియజేయాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది.



సింధు జలాలపై పాక్ మళ్లీ బెదిరింపులు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని పాకిస్తాన్ జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశ రక్షణ శాఖమంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. సింధు జలాల విషయంలో పాకిస్తాన్ ప్రేక్షకపాత్రకే పరిమితం కాదని, అవసరమైతే ప్రతిస్పందనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇస్లామాబాద్ తనకున్న ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు. అయితే ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయాన్ని వెల్లడించలేదు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వైఖరి మారనంతవరకు సింధు జలాల ఒప్పందాన్ని యథాతథంగా కొనసాగించే ప్రసక్తే లేదని భారత్ స్పష్టం చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రెండు దేశాల మధ్య జలవివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

వ్యూహాత్మక చర్యలకు సిద్ధమా..

ఒక మీడియా ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. సింధు జలాల విషయంలో పాక్ నిరంతరం మౌనంగా ఉండబోదని పేర్కొన్నారు. తమ ప్రతిస్పందనను మరింత తీవ్రతరం చేసే నిర్ణయాలపై ప్రభుత్వ ఉన్నతస్థాయిలో చర్చిస్తామని తెలిపారు. వివాద పరిష్కారం కోసం దౌత్యపరమైన మార్గాల్లో వేచి చూస్తారా? లేక సైనిక చర్యకు దిగుతారా? అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని, అవసరాన్ని బట్టి వ్యూహాన్ని మార్చుకుంటామని చెప్పారు. అయితే భారత్‌పై ఎలాంటి నిర్దిష్ట చర్యకు పాక్ సిద్ధమవుతోందన్నది వెల్లడికాలేదు.

పహల్గాం దాడితో మొదలైన పరిణామాలు...


గతేడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో భారత్ ప్రతిస్పందనగా పాకిస్తాన్‌తో కీలక సంబంధాలపై కఠిన నిర్ణయాలు తీసుకుంది. 1960లో కుదిరిన సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పాకిస్తాన్ ఆందోళనకు గురైంది. నీటి కొరత, వ్యవసాయంపై ప్రభావం వంటి అంశాలను ప్రస్తావిస్తూ అంతర్జాతీయ వేదికలపై భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది.

అంతర్జాతీయ తీర్పును తోసిపుచ్చిన భారత్..

సింధు జలాల ఒప్పందంపై హేగ్‌లోని మధ్యవర్తిత్వ న్యాయస్థానం వెలువరించిన నిర్ణయాలను భారత్ అంగీకరించడం లేదు. ఈ ట్రిబ్యునల్ ఏర్పాటు, దాని అధికార పరిధినే భారత్ ప్రశ్నిస్తోంది. ఒప్పందంలో పేర్కొన్న విధానాలకు విరుద్ధంగా ఏర్పాటైన ఈ ప్రక్రియలో వెలువడే నిర్ణయాలు తమకు కట్టుబాటు కావని స్పష్టం చేస్తోంది. ఉగ్రవాద దాడుల నేపథ్యంలో దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాలు తీసుకునే హక్కు తమకుందని వాదిస్తోంది.

పాక్‌కు పెరుగుతున్న సవాళ్లు...

మరోవైపు పాకిస్తాన్ ఆర్థిక ఇబ్బందులు, నీటి కొరతతో సతమతమవుతోంది. వ్యవసాయానికి సింధు నదీ వ్యవస్థ నీటిపై అధికంగా ఆధారపడిన ఆ దేశానికి ఒప్పందంపై నెలకొన్న ప్రతిష్ఠంభన ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశముంది. అయితే భారత్‌పై పాక్ ఎలాంటి ప్రత్యామ్నాయ వ్యూహాన్ని అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఉగ్రవాదం, సరిహద్దు భద్రత విషయంలో రాజీ పడబోమన్న భారత్ వైఖరి నేపథ్యంలో ఈ జలవివాదం ఎటువైపు మళ్లుతుందో చూడాలి.



ట్రంప్‌కు ఇరాన్ ఏడు డిమాండ్లు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిస్తున్న వేళ.. టెహ్రాన్ శాంతి చర్చలకు కొత్త ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. అమెరికాతో అణు చర్చలు జరపాలంటే తాము పంపిన ఏడు డిమాండ్లను అంగీకరించాల్సిందేనని స్పష్టం చేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఈ ప్రతిపాదనలు వాషింగ్టన్‌కు చేరినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఇరాన్ అధికారికంగా వాటిని ప్రకటించలేదు.

ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్...

అమెరికా నావికా దిగ్బంధాన్ని, ఆంక్షలను ఎత్తివేయడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, యుద్ధ నష్టాలకు పరిహారం చెల్లించడం, లెబనాన్ సహా ఇతర ప్రాంతాల్లో ఘర్షణలకు ముగింపు పలకడం, ఇరాన్‌పై దాడులను నిలిపివేయడం వంటివి ప్రధాన డిమాండ్లుగా ఉన్నట్లు సమాచారం.

యురేనియం విషయంలో పట్టు...

మరోవైపు ఇరాన్ వద్ద ఉన్న అధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వలను పూర్తిగా వదులుకోవాలని అమెరికా పట్టుబడుతోంది. అయితే వాటిని దేశం నుంచి బయటకు తరలించేందుకు టెహ్రాన్ నిరాకరిస్తోంది. అంతర్జాతీయ అణు పర్యవేక్షకుల సమక్షంలో తమ దేశంలోనే వాటిని నిర్వీర్యం చేసేందుకు సిద్ధమని స్పష్టం చేసింది. ఈ ప్రతిష్ఠంభన తొలగితేనే అణు చర్చలు ముందుకు సాగే అవకాశముంది. తాజా పరిణామాలతో ఇరాన్-అమెరికా మధ్య దౌత్య ప్రయత్నాలు కీలక దశకు చేరాయి.

ట్రంప్‌కు ట్రబుల్.. ఐదు అంశాలపై దర్యాప్తు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా సవాళ్లు విసురుతోంది. కాంగ్రెస్ ఉభయసభల్లో మెజారిటీ సాధించిన డెమోక్రాట్లు ఇక ట్రంప్ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ అవినీతి, ఎప్‌స్టీన్ కేసు సహా ఐదు కీలక అంశాలపై దర్యాప్తు చేపట్టాలని యోచిస్తున్నారు. మరోవైపు రిపబ్లికన్ పార్టీలోనూ విభేదాలు బయటపడుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధం ఎన్నికల్లో తమ పార్టీ ఓటమికి కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌పై వేటు వేసేందుకు ట్రంప్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 2028 అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తన రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

అవినీతి,ఎప్‌స్టీన్ సహా విచారణకు సిద్ధం..

ఎన్నికల్లో అవినీతి అంశం ఓటర్లను ప్రభావితం చేసిన నేపథ్యంలో ట్రంప్, ఆయన అనుయాయుల వ్యవహారాలపై విచారణ జరిపించాలని డెమోక్రాట్లు భావిస్తున్నారు. రాబర్ట్ గార్సియా నేతృత్వంలోని కమిటీ ఐదు ప్రధాన అంశాలను పరిశీలించనుంది. ట్రంప్ కుటుంబ వ్యాపారాలు, అక్రమ వలసదారుల పేరుతో ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ (ఐసీఈ) చేపట్టిన దాడులు,



జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసు విచారణ తీరు, ప్రభుత్వ సామర్థ్య విభాగం (డోజ్) ఏర్పాటు, ప్రభుత్వంలోని అవినీతి ఆరోపణలు ఇందులో ఉన్నాయి. ట్రంప్‌తో సంబంధాలున్న ఫార్మా కంపెనీలు లబ్ధి పొందిన వ్యవహారాలపైనా విచారణ జరిపిస్తామని ఒక సెనేటర్ వెల్లడించారు. శ్వేత సౌధంలో ట్రంప్ నిర్మించిన బాల్‌రూమ్, ఇతర నిర్మాణాలపైనా దర్యాప్తు జరపాలని కాలిఫోర్నియా సభ్యుడు జేర్డ్ హఫ్మన్ కోరుతున్నారు. స్పీకర్ పదవికి పోటీ పడుతున్న హకీం జెఫ్రీస్ సైతం ట్రంప్‌పై మరోసారి అభిశంసన ప్రక్రియ చేపట్టాలని సూచిస్తున్నారు.

హెగ్‌సెత్‌పై వేటు తప్పదా..?

ఇరాన్‌తో యుద్ధం విషయంలో రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ వ్యవహారశైలిపై ట్రంప్ అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. యుద్ధ పరిణామాలు, దాని వల్ల పెరిగిన ఇంధన ధరలు రిపబ్లికన్ల ఓటమికి దోహదం చేశాయన్న విశ్లేషణలు అధ్యక్షుడిపై ఒత్తిడి పెంచుతున్నాయి. హెగ్‌సెత్ స్థానంలో ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్‌ను నియమించే అవకాశం ఉందన్న ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఆయనను తొలగించడంపై అధికారిక నిర్ణయం వెలువడినట్లు స్పష్టత లేదు. ఇరాన్ యుద్ధంపై కాంగ్రెస్ విచారణలో రక్షణ శాఖను ప్రశ్నించే అవకాశం ఉందని సమాచారం.

2028పై వాన్స్ గురి..

మరోవైపు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ రాజకీయ భవిష్యత్తుపైనా చర్చ మొదలైంది. 2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలను దృష్టిలో పెట్టుకొని తన రాజకీయ ప్రాధాన్యాలను రూపొందించుకుంటున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. ట్రంప్ జాతీయవాద విధానాలకు మద్దతిస్తూనే ఇరాన్ యుద్ధం వంటి విదేశాంగ అంశాలపై అసంతృప్తిగా ఉన్న వర్గాలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల పరాజయానికి ఇరాన్ ఘర్షణ కూడా కారణమైందన్న అభిప్రాయాన్ని ట్రంప్ అంగీకరించినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే అణ్వాయుధాల తయారీని ఇరాన్ నుంచి నిరోధించడమే తమ లక్ష్యమని ఆయన సమర్థించుకుంటున్నారు. మొత్తంగా కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల ఆధిపత్యం ట్రంప్ పాలనకు కొత్త సవాళ్లు విసరనుంది.

పరాగ్వే అధ్యక్షుడి రాజీనామా

- ఉయెనో బ్యాంక్ సంక్షోభంతో పెనా గుడ్ బై
- అభిశంసన తీర్మానానికి దిగువ సభ ఆమోదం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

దక్షిణ అమెరికా ఖండం నడిబొడ్డున ఉన్న పరాగ్వేలో భారీ బ్యాంకింగ్ సంక్షోభం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. దేశ అధ్యక్షుడు శాంటియాగో పెనా తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో సన్నిహిత సంబంధాలున్న డిజిటల్ రుణ సంస్థ ఉయెనో బ్యాంకును కేంద్ర బ్యాంకు సీజ్ చేయడం, లక్షలాది మంది ఖాతాదారుల పొదుపు నిలిచిపోవడం, దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పెనా రాజీనామా ప్రకటించిన కొద్ది నిమిషాలకే దిగువ సభ ఆయనపై అభిశంసన తీర్మానాన్ని 780 ఓట్లతో ఆమోదించి సెనేట్‌కు పంపింది. ఉపాధ్యక్షుడు పెడ్రో అలియానా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

ప్రజాధనం దుర్వినియోగం ఆరోపణలు...

ఉయెనో బ్యాంకు పరాగ్వేలోని 60 శాతానికిపైగా వయోజనులకు సేవలందిస్తోంది. ప్రభుత్వ, పింఛను నిధులకు చెందిన సుమారు 800 మిలియన్ డాలర్ల ప్రజా డిపాజిట్లు ఇందులో ఉన్నట్లు సమాచారం. బ్యాంకు యజమానులకు సంబంధం ఉన్న సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా భారీ రుణాలు ఇచ్చినట్లు కేంద్ర బ్యాంకు గుర్తించింది. దీంతో మూలధనం చట్టబద్ధ కనీస స్థాయి కంటే దిగువకు పడిపోవడంతో బ్యాంకును స్వాధీనం చేసుకుంది. ఆరుగురు ఉన్నతాధికారులను జైలుకు పంపగా, పలువురిపై మోసం, నమ్మకద్రోహం ఆరోపణలు నమోదయ్యాయి.

వీధుల్లో నిరసనలు.. ఉద్యోగాలకూ ముప్పు...



బ్యాంకు సేవలు నిలిచిపోవడంతో ఖాతాదారులు ఆందోళనకు దిగారు. వేలాది మంది కాంగ్రెస్ భవనం వైపు కదం తొక్కారు. పెనా రాజీనామా చేసినా తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని నిరసనకారులు స్పష్టం చేశారు. ఈ సంక్షోభం బ్యాంకు, అనుబంధ సంస్థల్లో సుమారు 7 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలపై ప్రభావం చూపినట్లు కార్మిక శాఖ అంచనా వేసింది. రాజీనామాతో బాధ్యత నుంచి తప్పించుకోలేరని, అభిశంసన ప్రక్రియ కొనసాగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చరిత్రను తిరగరాస్తారా..? డెమోక్రాట్ల దూకుడు

- 260 స్థానాల గెలుపు దిశగా ప్రభంజనం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు చరిత్రాత్మక విజయానికి చేరువవుతున్నారు. రెండేళ్ల క్రితం అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలిచిన జిల్లాల్లోనూ పాగా వేస్తూ రిపబ్లికన్లకు గట్టి షాక్ ఇచ్చారు. 2024లో ట్రంప్ విజయం సాధించిన 234 జిల్లాల్లో 52 చోట్ల డెమోక్రాట్లు ఆధిక్యం సాధించారు. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం ప్రతినిధుల సభలో ఆ పార్టీకి 253 స్థానాలు దక్కగా.. రిపబ్లికన్లు 155 స్థానాలకే పరిమితమయ్యారు. మరో 27 చోట్ల ఫలితాలు వెలువడాల్సి ఉంది.



1990 నాటి రికార్డుపై గురి..

మిగిలిన స్థానాల్లోనూ డెమోక్రాట్లు పుంజుకుంటే 260 మార్కును దాటే అవకాశముంది. అదే జరిగితే ప్రతినిధుల సభలో భారీ మెజారిటీ సాధించినట్లవుతుంది. 1990ల ప్రారంభంలో ఆ పార్టీ గెలుచుకున్న 267 స్థానాలే ఇప్పటివరకు అత్యధికం. 2008లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు 257 స్థానాలు దక్కించుకుంది. తాజా ఫలితాలతో ఈ రెండు రికార్డులనూ డెమోక్రాట్లు అధిగమిస్తారా అన్న ఉత్కంఠ నెలకొంది.

శాంతి దళాల రక్షణపై భారత్ ప్రతిపాదన

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ప్రపంచవ్యాప్తంగా శాంతి పరిరక్షణ విధులు నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి (ఐరాస) దళాలకు మరిన్ని వనరులు, మెరుగైన రక్షణ కల్పించాలని భారత్ కోరింది. మారుతున్న అంతర్జాతీయ భద్రతా పరిస్థితులకు అనుగుణంగా శాంతి పరిరక్షణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని భారత్ పిలుపునిచ్చింది. పరిమిత వనరులతో దళాల నుంచి అసాధారణ ఫలితాలను ఆశించడం సరికాదని స్పష్టం చేసింది. ఐరాస వార్షిక సమావేశాల్లో భాగంగా నిర్వహించిన శాంతి పరిరక్షణ చర్చల సమీక్షలో భారత మిలిటరీ అడ్వైజర్ కర్నల్ తరుణేంద్ర ప్రతాప్ సింగ్ ఈ సూచనలు చేశారు. నాన్ అలైన్డ్ మూవ్‌మెంట్ (ఎన్ఏఎం) తరఫున మొరాకో సమర్పించిన నివేదికకు భారత్ మద్దతు ప్రకటించింది.

ఏడు దశాబ్దాలుగా భారత్ సేవలు...

ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ మిషన్లతో భారత్‌కు ఏడు దశాబ్దాల అనుబంధం ఉందని కర్నల్ సింగ్ గుర్తుచేశారు. ఇప్పటివరకు 50కి పైగా మిషన్లలో మూడు లక్షల మందికిపైగా భారత సైనికులు, పోలీసు సిబ్బంది సేవలందించారని తెలిపారు. ప్రపంచ శాంతి కోసం విధులు నిర్వహిస్తూ 184 మంది భారతీయులు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. అత్యధికంగా శాంతి పరిరక్షక దళాలను అందించిన దేశాల్లో భారత్



ముందుందని భారత మిలిటరీ అడ్వైజర్ కర్నల్ తరుణేంద్ర ప్రతాప్ సింగ్ వివరించారు.

దళాలకు రక్షణ.. దేశాలకు ప్రాతినిధ్యం...

శాంతి పరిరక్షక దళాల విధివిధానాలు రూపొందించేటప్పుడు సైనిక, పోలీసు బలగాలను పంపే దేశాలతో భద్రతా మండలి నిరంతరం సంప్రదింపులు జరపాలని భారత్ సూచించింది. దళాలపై దాడులకు పాల్పడే ఉగ్రవాదులు, ఇతర మూకలను బాధ్యులుగా చేయాలని కోరింది. శాంతి పరిరక్షకులపై జరిగే నేరాల విచారణ, జవాబుదారీతనం కోసం భారత్ నేతృత్వంలో తీసుకొచ్చిన తీర్మానం 2589ను సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. స్పష్టమైన రాజకీయ లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళిక లేని మిషన్లను కొనసాగించడం వల్ల ఐక్యరాజ్యసమితి వనరులు వృథా అవుతాయని భారత్ హెచ్చరించింది.

మహిళా దళాల విషయంలో ఆదర్శం...

శాంతి పరిరక్షణలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంలో భారత్ ముందుందని కర్నల్ సింగ్ పేర్కొన్నారు. 1960 నుంచే మహిళలను శాంతి దళాల్లోకి పంపుతున్నట్లు తెలిపారు. 2007లో లైబీరియాకు ఐరాస చరిత్రలోనే తొలిసారిగా పూర్తిస్థాయి మహిళా పోలీసు బృందాన్ని పంపిన ఘనత భారత్‌దేనని గుర్తుచేశారు. ప్రస్తుతం వివిధ మిషన్లలో 160 మంది భారతీయ మహిళలు సేవలందిస్తున్నారని వెల్లడించారు. సమాచార వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ఆధునిక సాంకేతికత, పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించాలని భారత మిలిటరీ అడ్వైజర్ కర్నల్ తరుణేంద్ర ప్రతాప్ సింగ్ సూచించారు.

భద్రతా మండలిలో సభ్యత్వమే లక్ష్యం...

2028-29 కాలానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యత్వం కోసం భారత్ పోటీ పడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. శాంతి పరిరక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం తమ ప్రాధాన్యాల్లో ఒకటని స్పష్టం చేశారు. ఈ అంశాలపై చర్చలకు సీ34 కమిటీ సరైన వేదికగా అభివర్ణించారు. ప్రపంచ శాంతి, భద్రతల పరిరక్షణలో భారత్ భవిష్యత్తులోనూ బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తుందని భారత మిలిటరీ అడ్వైజర్ కర్నల్ తరుణేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు.

2028 అధ్యక్ష రేసులో 39 ఏళ్ల జాన్ ఒసాఫ్?

- ఒబామాతో పోల్చుకుంటున్న అమెరికన్లు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా రాజకీయాల్లో యువ నాయకుడు జాన్ ఒసాఫ్ పేరు ఇప్పుడు ఆసక్తికర చర్చకు తెరలేపుతోంది. జార్జియా రాష్ట్రంలో కీలక సెనేట్ స్థానాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయానికి ఆయన కీలకంగా నిలిచినట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. 39 ఏళ్ల ఒసాఫ్ రాజకీయ ప్రస్థానం, ప్రసంగశైలి, ప్రజాకర్షణను చూస్తున్న రాజకీయ పరిశీలకులు ఆయనను మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పోలుస్తున్నారు. దీంతో 2028 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ల తరఫున ఆయన బరిలోకి దిగుతారా? అనే చర్చ మొదలైంది.

ట్రంప్ వర్గంపై ఘాటు విమర్శలు...

2021లో తొలిసారి సెనేటర్‌గా ఎన్నికైన ఒసాఫ్.. తాజాగా జార్జియాలో మరోసారి తన పట్టును నిరూపించుకున్నారని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ప్రచారంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహిత



బృందంపై తీవ్ర విమర్శలు చేశారు. ట్రంప్ వర్గాన్ని 'ఎప్‌స్టీన్ క్లాస్', 'మారెలాగో మాఫియా' అంటూ అభివర్ణించారు. విజయం అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు ట్రంప్ అవినీతి, అసమర్థతను తిరస్కరించారని వ్యాఖ్యానించారు. రాజకీయ విభేదాలతో ఏర్పడిన సామాజిక చీలికలను పూడ్చడమే తమ ముందున్న లక్ష్యమని ఒసాఫ్ పేర్కొన్నారు.

ఒబామా శైలిలో ప్రసంగాలు...

ఒసాఫ్ ప్రసంగ తీరు, ప్రజలతో మమేకమయ్యే విధానం 2008 నాటి యువ ఒబామాను గుర్తుచేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒబామా కూడా ఆయనకు మద్దతుగా ప్రచారం చేశారు. 17 ఏళ్ల వయసులోనే పౌరహక్కుల నేత జాన్ లూయిస్ వద్ద పనిచేసిన అనుభవం ఒసాఫ్‌కు ఉంది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఉన్నత విద్య అభ్యసించిన ఆయన.. పరిశోధనాత్మక డాక్యుమెంటరీల నిర్మాణ సంస్థలోనూ పనిచేశారు.

వైట్‌హౌస్‌పై కన్నేస్తారా..?

ప్రస్తుతానికి అధ్యక్ష పదవిపై పోటీ చేసే ఆలోచన లేదని ఒసాఫ్ చెబుతున్నప్పటికీ.. ఆయనకు పెరుగుతున్న ప్రజాదరణ డెమోక్రాట్లలో ఆశలు రేకెత్తిస్తోంది. యువ నాయకత్వం కోసం ఎదురుచూస్తున్న పార్టీకి ఆయన బలమైన ప్రత్యామ్నాయంగా మారతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే 2028 ఎన్నికల్లో పోటీపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.



వేతనాల పెంపుపై కార్మికుల భారీ ర్యాలీ

పారిస్ (ఏడీఎన్ఎన్) :

వేతనాల పెంపు కోసం ఫ్రాన్స్‌లో కార్మికులు కదం తొక్కారు. లక్షలాది మంది రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులు కొంతకాలంగా కొనసాగిస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. పారిస్, లియోన్, మార్సెయ్ సహా దేశంలోని పలు ప్రధాన నగరాల్లో శుక్రవారం ఈ ర్యాలీలు జరిగాయి. దేశవ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది కార్మికులు పాల్గొన్నట్లు అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అత్యధిక ప్రాంతాల్లో నిరసనలు ప్రశాంతంగా సాగినప్పటికీ లియోన్, నాంటెస్, పావ్, ఆర్లీన్స్, రెన్నెస్, టూలూస్ నగరాల్లో స్వల్ప హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు విద్యార్థుల ఆందోళనలు సైతం కొనసాగాయి. నిరసనల ప్రభావంతో దేశంలోని దాదాపు మూడోవంతు హైస్కూళ్లు మూతపడ్డాయి.



ప్రధానిగా ఐసెన్‌కోట్‌కు లైన్ క్లియర్


- విపక్ష నేతకు అరబ్బు పార్టీల మద్దతు
- 67 మందికి పెరిగిన సభ్యుల బలం
- కింగ్ మేకర్‌గా మారిన అరబ్బు కూటమి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఇజ్రాయెల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు విపక్ష నేత గడీ ఐసెన్‌కోట్‌కు మార్గం సుగమమైంది. దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో తాజాగా జరిగిన సంప్రదింపుల్లో అరబ్బు పార్టీలు ఐసెన్‌కోట్‌కు మద్దతు ప్రకటించాయి. దీంతో గడీ ఐసెన్‌కోట్‌కు 67 మంది పార్లమెంటు సభ్యుల మద్దతు లభించే అవకాశముంది. నెతన్యాహుకు 46 మంది సభ్యుల మద్దతు మాత్రమే దక్కుతోంది.

కింగ్‌మేకర్‌గా మారిన అరబ్బు పార్టీలు...

ఇటీవల జరిగిన పార్లమెంట్ (నెస్సెట్) ఎన్నికల్లో బెంజమిన్ నెతన్యాహు కూటమికి 53, ఐసెన్‌కోట్ కూటమికి 48 స్థానాలు వచ్చాయి. 19 స్థానాలు గెలుచుకున్న అరబ్బు పార్టీల కూటమి కీలకంగా మారింది. ఈసారి నెతన్యాహుకు చిరకాల మిత్రపక్షమైన యునైటెడ్ తోరా జూడాయిజం (యూటీజే) కూడా మద్దతు ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో ఆయన బలం మరింత తగ్గింది. అరబ్బు పార్టీల మద్దతుతో ఐసెన్‌కోట్ ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలాన్ని సాధించే దిశగా ముందుకెళ్తున్నారు. అయితే ప్రభుత్వ ఏర్పాటుపై తుది నిర్ణయం, అధికారిక ప్రక్రియలు ఇంకా పూర్తికావాల్సి ఉంది.



ఫ్రాన్స్‌లో ఇద్దరు విద్యార్థులు మృతి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

తూర్పు ఫ్రాన్స్ లో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం ఘటన చోటుచేసుకుంది. స్విట్జర్లాండ్ సరిహద్దుకు సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న లోతైన కందకంలోకి ఒరిగిపోయింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడగా.. ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ప్రమాద సమయంలో బస్సులో ఎక్కువ మంది పాఠశాల విద్యార్థులే ఉన్నట్లు ఫ్రాన్స్ విద్యాశాఖ మంత్రి ఎడ్వర్డ్ జెఫ్రే వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సహాయక బృందాలు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను బయటకు తీసి సమీప ఆసుపత్రులకు వైద్య చికిత్సల నిమిత్తం తరలించారు.

ఘటనా స్థలానికి మంత్రి ...

ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి ఫిలిప్ టబరోట్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఘటనా స్థలానికి బయలుదేరినట్లు ప్రకటించారు. మృతుల సంఖ్య, ప్రమాదానికి గల కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.



నా సహనాన్ని చేతకానితనంగా
భావించవద్దు

నెల్లూరు (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియపై వైసీపీ చేస్తోన్న ఆరోపణలను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో తిప్పికొట్టారు. నెల్లూరులో మీడియాతో శుక్రవారం మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం చట్టబద్ధంగా, ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తుంటే వైసీపీ కావాలనే అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. సాధారణంగా ఓసీకి కేటాయించిన మేయర్ స్థానాన్ని సైతం బీసీ వర్గాలకు కేటాయించడమే తెలుగుదేశం పార్టీ నిబద్ధతకు ప్రత్యక్ష నిదర్శనమని స్పష్టం చేశారు. గత వైసీపీ హయాంలో నామినేషన్ల సమయంలోనే ప్రత్యర్థి అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ఉపసంహరింపజేశారని, కానీ ప్రస్తుతం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరుగుతుంటే ఆటంకాలు కలిగిస్తున్నారని విమర్శించారు. ఆత్మకూరులో 10 వార్డులలో వైసీపీ అభ్యర్థులు గెలుపొందినా తాము ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా ప్రజా తీర్పును గౌరవించామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అనంతసాగరం పోలింగ్ కేంద్రంలో చోటుచేసుకున్న ఘటనపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి సుమారు వందమంది అనుచరులతో పోలింగ్ కేంద్రానికి వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు తీవ్రంగా ప్రయత్నించారని, దొంగ ఓట్లు వేయించేందుకు కుట్ర పన్నుతుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డిని ఉద్దేశించి మంత్రి ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. తన సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని తక్కువ అంచనా వేయవద్దని, సుప్రీంకోర్టుకు లాగుతాననే బెదిరింపులకు తాను ఏమాత్రం భయపడేది లేదని స్పష్టం చేశారు. తాము ప్రస్తుతం ఎంతో సంయమనంతో వ్యవహరిస్తున్నామని, తన సహనాన్ని చేతకానితనంగా భావిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆనం గట్టిగా హెచ్చరించారు.



పరిషత్ ఎన్నికల్లో
70.72శాతం పోలింగ్

విజయవాడ (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా గురువారం ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ (పరిషత్) ఎన్నికలకు సంబంధించిన అధికారిక పోలింగ్ గణాంకాలను రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో విడుదల చేసింది. నిన్న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. లెక్కింపు పూర్తి చేసుకున్న తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటున 70.72 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎస్ఈసీ అధికారికంగా ప్రకటించింది. జిల్లాల వారీగా నమోదు అయిన పోలింగ్ శాతాలను పరిశీలిస్తే గణనీయమైన వ్యత్యాసాలు నమోదయ్యాయి. విశాఖపట్నం జిల్లాలో ఉన్న నాలుగు జడ్పీటీసీ స్థానాల్లో ఏకంగా 82.51 శాతం పోలింగ్ నమోదై రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక అత్యల్పంగా గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో 62.01 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మిగిలిన జిల్లాల్లో పరిశీలిస్తే చిత్తూరు జిల్లాలో 76.30 శాతం, అనకాపల్లిలో 75.58 శాతం, కృష్ణా జిల్లాలో 73.21 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే అన్నమయ్య జిల్లాలో 69.19 శాతం, బాపట్లలో 67.47 శాతం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 66.33 శాతం, శ్రీకాకుళంలో 65.51 శాతం , అనంతపురం జిల్లాలో 64.38 శాతం చొప్పున ఓటింగ్ నమోదైనట్లు అధికారులు స్పష్టం చేశారు. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.



ప్రభుత్వ వైద్య కళాశాలల్లో
కొత్తగా 161 'పీజీ సీట్లు'

అమరావతి (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్యను అభ్యసించాలనుకునే ప్రతిభావంతులైన మెరిట్ విద్యార్థులకు నేషనల్ మెడికల్ కమిషన్ శుభవార్త శుక్రవారం అందించింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 విభిన్న వైద్య విభాగాలలో కొత్తగా 161 పీజీ సీట్లను మంజూరు చేస్తూ ఎన్ఎంసీ అధికారిక అనుమతులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 163 సీట్ల కోసం ప్రతిపాదనలు పంపగా, ఎన్ఎంసీ పరిశీలించి ఏకంగా 161 సీట్లకు (98.77 శాతం) ఆమోదం తెలపడం విశేషం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధనా సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు, ఆస్పత్రులలో పడకల సంఖ్య పెంపు, అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించడం వల్లే ఈ అరుదైన విజయం సాధ్యమైందని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ నూతన పీజీ సీట్ల పెంపుదల ద్వారా రాష్ట్రంలోని మెరిట్ విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య మరింత సులభంగా అందుబాటులోకి రానుంది. ఎన్ఎంసీ మంజూరు చేసిన 161 సీట్లలో వివిధ విభాగాల వారీగా లభించిన గణాంకాలను పరిశీలిస్తే.. ఆర్థోపెడిక్స్ విభాగంలో అత్యధికంగా 27 పీజీ సీట్లు మంజూరయ్యాయి. అలాగే చర్మ, సుఖ వ్యాధుల విభాగం, ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాలలో ప్రతిదానిలోనూ 16 చొప్పున పీజీ సీట్లు కేటాయించబడ్డాయి. మిగిలిన సీట్లు ఇతర ప్రధాన క్లినికల్, నాన్‌క్లినికల్ విభాగాలకు పంచడం జరిగిందని, దీనివల్ల ప్రభుత్వ వైద్య రంగంలో నిపుణులైన డాక్టర్ల కొరత తీరడంతో పాటు వైద్య సేవలు మరింత మెరుగవుతాయని అధికారులు తెలిపారు.

నామినేషన్ల ఆన్‌లైన్ అప్‌లోడ్‌పై
హైకోర్టు ఆగ్రహం



అమరావతి (ఏడీఎన్ఎన్) :

జడ్పీటీసీ, ఎంపీటీసీ , స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను ఆన్‌లైన్‌లో పొందుపరచడంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రదర్శించిన నిర్లక్ష్యంపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థుల పూర్తి వివరాలు ప్రజలకు, ఓటర్లకు పారదర్శకంగా అందుబాటులో ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఎస్ఈసీ దానిని అమలు చేయకపోవడంపై న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అభ్యర్థులకు సంబంధించిన క్రిమినల్ రికార్డులు, ఆస్తులు, అప్పులు , విద్యార్హతల వివరాలతో కూడిన అఫిడవిట్లు ఎస్ఈసీ అధికారిక పోర్టల్‌లో అందుబాటులో లేకపోవడం వల్ల ఓటర్ల సమాచార హక్కుకు భంగం కలుగుతోందని పేర్కొంటూ దాఖలైన ప్రజాప్రయోజన పిటిషన్ పై ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ఎస్ఈసీ తీరును నిలదీస్తూ, నిబంధనల ప్రకారం అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో ఎందుకు ఉంచలేకపోయారో తక్షణమే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై ఎన్నికల సంఘం స్పందిస్తూ ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియలో సాంకేతిక లోపాలు, ఇతర ఇబ్బందులు ఎదురుకావడం వల్లే తాత్కాలికంగా జాప్యం జరిగిందని ధర్మాసనానికి వివరణ ఇచ్చింది. ఆ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించి అభ్యర్థుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని కోర్టుకు హామీ ఇచ్చింది. న్యాయస్థానం హెచ్చరికల నేపథ్యంలో తక్షణమే స్పందించిన ఎస్ఈసీ, పోటీలో ఉన్న అభ్యర్థుల నామినేషన్లు, అఫిడవిట్ల సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం స్థానిక పరిషత్ పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో, ఎస్ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చిన అభ్యర్థుల వివరాలపై సర్వత్రా తీవ్ర ఆసక్తి నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ నామినేషన్లలో తప్పుడు సమాచారం ఇచ్చారా లేదా ఏమైనా కీలక వివరాలు దాచారా అనే విషయాలను ప్రజలు, ప్రత్యర్థి అభ్యర్థులు నిశితంగా పరిశీలించే అవకాశం ఏర్పడింది. ఒకవేళ అభ్యర్థుల అఫిడవిట్లలో ఏవైనా తప్పుడు వివరాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే, వాటి ఆధారంగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి వారి ఎన్నికను సవాల్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చట్టపరమైన నిపుణులు భావిస్తున్నారు.



స్థానిక ఫలితాలతో
పెరిగిన బీజేపీ గ్రాఫ్

జమ్మలమడుగు (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామనే నమ్మకమే గనుక వైసీపీకి ఉంటే, ఐదేళ్ల క్రితం 2019లో తమ విజయం కూడా రిగ్గింగ్ వల్లే సాధ్యమైందని జగన్ మోహన్ రెడ్డి బహిరంగంగా ఒప్పుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఘాటుగా డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ గ్రాఫ్ గతంతో పోలిస్తే మరింత పాజిటివ్‌గా మారిందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తమ పార్టీ రాష్ట్రంలో అత్యంత బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నిరంతరం దౌర్జన్యాలు చేస్తున్నానంటూ నిందలు మోపే వైసీపీ నాయకులే, వాస్తవానికి తమ సొంత గ్రామాలు, ప్రాంతాల్లో తీవ్ర అరాచకాలకు దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రత్యర్థికి చెందిన సొంత ఊరు 'గొల్లగుంట' అభివృద్ధిపై ప్రస్తావిస్తూ ఆదినారాయణ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం 1,100 ఓట్లు ఉన్న చిన్న గ్రామాన్ని కూడా కనీసం అభివృద్ధి చేయలేని సదరు వైసీపీ నాయకుడు, వరుసగా నాలుగు సార్లు ఎన్నికల్లో దారుణ పరాజయం పాలయ్యారని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకుల స్వార్థపూరిత తీరు, పాలనా వైఫల్యాలు నచ్చకపోవడం వల్లే వారి సొంత ఊరి ప్రజలే వారిని పూర్తిగా పక్కన పెట్టారని వ్యాఖ్యానించారు. ప్రజామోదం పూర్తిగా కోల్పోవడంతో పాటు, కొన్ని పోలింగ్ స్థానాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఎన్నికలను బహిష్కరించి వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని వివరించారు. వ్యక్తిగతంగా తనపై వైసీపీ నేతలు చేస్తోన్న ఆరోపణలన్నింటినీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పాత రాజకీయ వైరాన్ని మనసులో ఉంచుకుని, ఓటమి భయంతోనే తనపై పదే పదే లేనిపోని అసత్య ఆరోపణలకు తెగబడుతున్నారని స్పష్టం చేశారు. అబద్ధపు ప్రచారాలు, విమర్శలతో ప్రజలను మభ్యపెట్టడం జగన్ పార్టీకి సాధ్యం కాదన్నారు. ఇటువంటి రాజకీయ విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆయన తేల్చిచెప్పారు.

పోలీసులతోనే
పోరాడాల్సిన దుస్థితి



నెల్లూరు (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్‌లో గురువారం నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ (పరిషత్) ఎన్నికలు తీవ్ర అరాచకాల మధ్య సాగాయని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరులో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో అధికార కూటమి అడ్డదారులు తొక్కిందని, ప్రజలను కాపాడాల్సిన పోలీసులతోనే తమ పార్టీ శ్రేణులు పోరాడాల్సిన దారుణ పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల్లో ఒక్కదానిని కూడా అధికారులు అమలు చేయలేదని మండిపడ్డారు. వైసీపీ పోలింగ్ ఏజెంట్లను లక్ష్యంగా చేసుకుని తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డారని, కీలక నాయకులను పోలీసుల సహాయంతో హౌస్ అరెస్టులు చేయించడమే కాకుండా, గ్రామాల్లోకి వెళ్లకుండా నిర్బంధించి తరిమికొట్టారని ఆరోపించారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా పోలీసుల సమక్షంలోనే తమ పార్టీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పట్ల పోలీసులు అత్యంత నిర్దాక్షిణ్యంగా జులుం ప్రదర్శించారని కాకాణి ఆరోపించారు. స్వయంగా మంత్రి పదవిలో ఉన్న ఆనం రామనారాయణరెడ్డి పోలింగ్ కేంద్రాల వద్దకు నిబంధనలకు విరుద్ధంగా ఎలా వెళ్తారని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలే స్వయంగా బూత్‌ల వద్దకు వెళ్లి క్యాప్చరింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. స్పష్టమైన ఆధారాలతో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను చూపించినా సదరు కేంద్రాల్లో పోలింగ్‌ను ఎందుకు రద్దు చేయలేదని జిల్లా కలెక్టర్‌ను కాకాణి నిలదీశారు. మర్రిపాడు ఎస్ఐ బలరాం, సీఐ గంగాధర్‌లు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని, గూడూరు వైసీపీ ఇన్‌చార్జ్ గురవయ్య ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడికి యత్నించినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వయంగా పోలీసు యంత్రాంగమే రిగ్గింగ్‌లకు సహకరిస్తూ పాల్గొంటుంటే ఇక రాజ్యాంగానికి రక్షణ ఎక్కడ ఉంటుందని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఘాటుగా ప్రశ్నించారు. చట్టాన్ని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన అధికార పార్టీ నేతలు , వారికి సహకరించిన పోలీస్ అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిషత్ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఈ తరహా అక్రమాలు, దాడులపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ , ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రజాస్వామ్యబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై సర్కార్ ఉక్కుపాదం

అమరావతి (ఏడీఎన్ఎన్) :



రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు, ఖనిజాల అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో ఉక్కుపాదం మోపడానికి శ్రీకారం చుట్టింది. బాపట్ల జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం అత్యంత కఠిన నిర్ణయం తీసుకుంది. ఇకపై బాధితులు లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రాథమిక సమాచారం అందిన మూడు రోజుల్లోనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్ళి తనిఖీలు నిర్వహించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా ప్రభుత్వ లేదా ప్రైవేటు భూమిలో అక్రమ తవ్వకాలు జరిగితే, ఆ భూమి ఏ ప్రభుత్వ శాఖ లేదా ఏ అధికారి పరిధిలోకి వస్తుందో ఆయా అధికారులదే పూర్తి బాధ్యత అని తెగేసి చెప్పింది. అధికారుల తనిఖీల్లో అక్రమ మైనింగ్ నిర్ధారణ అయితే నిందితులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాల సీజింగ్, అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్ చేయడం , కఠినమైన ఎఫ్ఐఆర్‌ల నమోదు వంటి కఠిన చర్యలు ఉంటాయని నిబంధనల్లో పొందుపరిచింది. ఒకవేళ అధికారుల వైపు నుంచి ఏవైనా నిర్లక్ష్యాలు, లోపాలు లేదా నిందితులతో కుమ్మక్కైనట్లు బయటపడితే వారిపై కూడా శాఖాపరమైన తీవ్ర చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం హెచ్చరించింది. అక్రమ మైనింగ్‌ను సమర్థవంతంగా అరికట్టడానికి, ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పెంపొందించడానికి ప్రభుత్వం సమగ్రమైన పర్యవేక్షణ వ్యవస్థను సిద్ధం చేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి 15 రోజులకు ఒకసారి మైనింగ్‌పై నమోదైన కేసులు, చర్యలపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. దీనికి తోడు రాబోయే 30 రోజుల్లో ప్రజల ఫిర్యాదుల నమోదు, క్షేత్రస్థాయి తనిఖీలు, అధికారులు తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచేలా ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ , డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పూర్తిస్థాయి మార్గదర్శకాలకు తుది రూపు ఇచ్చేందుకు ఈ నెలాఖరులోగా మరొక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

చీరాలలో 10 వార్డులు
కాంగ్రెస్ కైవసం

చీరాల (ఏడీఎన్ఎన్) :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నామమాత్రంగా ఉన్నప్పటికీ, బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ అనూహ్య రీతిలో సంచలనం సృష్టించింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చీరాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 వార్డులను కైవసం చేసుకుని అందరినీ విస్మయానికి గురిచేసింది. స్థానిక రాజకీయ సమీకరణాలకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ ఈ స్థాయిలో విజయం సాధించడం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 44 వార్డులకు జరిగిన ఎన్నికలకు సంబంధించి వెలువడిన తుది ఫలితాలలో అధికార తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 22 స్థానాలను గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. అయితే, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 వార్డుల్లో ఘన విజయం సాధించి బలమైన శక్తిగా అవతరించింది. ఇక వైసీపీ కేవలం 8 స్థానాలతో సరిపెట్టుకుని మూడో స్థానానికి పడిపోగా, జనసేన 2, బీజేపీ 1 ,ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ, చీరాలలో మాత్రం ప్రధాన ప్రతిపక్షాన్ని సైతం వెనక్కి నెట్టి బలమైన ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం.

రీ-పోలింగ్,కౌంటింగ్‌కు
నిరాకరణ

అమరావతి (ఏడీఎన్ఎన్) :



వైసీపీ నేత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో పాటు మరో ఇద్దరికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఊహించని షాక్ తగిలింది. స్థానిక సంస్థలైన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో భాగంగా తిరుపతి రూరల్ పరిధిలోని చంద్రగిరి, పాకాల మండలాల్లోని పలు వార్డుల్లో పోలింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ అక్కడ తిరిగి రీపోలింగ్ నిర్వహించాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియను వాయిదా వేయాలని కోరుతూ వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు ధర్మాసనం ఎదుట ఇరువర్గాల వాదనలు వినడం జరిగింది. ఈ విచారణ సందర్భంగా ఎన్నికల కమిషన్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది అశ్వని కుమార్ కోర్టుకు కీలక విషయాలు వివరించారు. తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల మండలాల్లో పోలింగ్‌లో ఎలాంటి అక్రమాలు జరిగినట్లు జిల్లా కలెక్టర్ నుంచి అధికారికంగా ఎలాంటి నివేదిక రాలేదని స్పష్టం చేశారు. ఎటువంటి ఆధారాలు లేదా నివేదికలు లేనప్పుడు అక్కడ రీపోలింగ్‌కు ఆదేశాలు జారీ చేయడం కుదరదని ఆయన పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన హైకోర్టు, రీపోలింగ్‌కు ఆదేశించేందుకు నిరాకరించింది. అంతేకాకుండా, ఓట్ల లెక్కింపు ప్రక్రియను కూడా నిలువరించలేమని తేల్చిచెప్పడంతో చెవిరెడ్డి వర్గానికి చుక్కెదురైనట్లయింది.

వైసీపీ నుంచి నన్ను
బయటకు నెట్టేశారు



విజయవాడ (ఏడీఎన్ఎన్) :

వైసీపీని వీడటంపై మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి మరోసారి ఘాటుగా స్పందిస్తూ తన వైఖరిని స్పష్టం చేశారు. విజయవాడలో మీడియా సమావేశంలో శుక్రవారం మాట్లాడిన ఆయన, తాను సొంతంగా వైసీపీని వీడి వెళ్లలేదని, వెళ్లిపోవాలని అనుకోలేదని వెల్లడించారు. పార్టీలోని కొందరు నేతలు నేరుగా పొమ్మనకుండా పొగబెట్టి తనను బయటకు నెట్టేశారని సంచలన ఆరోపణలు చేశారు. వైసీపీలో ఉన్న సమయంలో తాను సొంత పార్టీలోనే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నుంచి సైతం కొన్ని సందర్భాల్లో తీవ్రమైన అవమానాలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో దాదాపు 70కి పైగా సంఘటనల్లో తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో పార్టీకి దూరం కావాల్సి వచ్చిందని ఆయన వివరించారు. తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ కార్యాచరణ, పనిచేసే విధానంపై విజయసాయిరెడ్డి స్పష్టతనిచ్చారు. త్వరలో రాబోయే తమ కొత్త పార్టీలో నాయకులు, కార్యకర్తలందరికీ సమన్యాయం, తగిన ప్రాధాన్యత ఉంటాయని హామీ ఇచ్చారు. వ్యక్తిస్వామ్యానికి తావులేకుండా పార్టీ ప్రారంభం నుంచే సంపూర్ణ ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతామని వెల్లడించారు. ఈ నెల 11వ తేదీన తమ నూతన రాజకీయ పార్టీ పేరును,జెండాను అధికారికంగా ప్రకటించబోతున్నట్లు విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

దాడిలో గాయపడ్డ విద్యార్థిని
గోపిక కోలుకుంటోంది



రాప్తాడు (ఏడీఎన్ఎన్) :

అనంతపురం జిల్లా రాప్తాడులో ఉన్మాది దాడి ఘటనలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని గోపిక వేగంగా కోలుకుంటోందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ, చేనేత,జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. విజయవాడ మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపికను మంత్రి సవిత శుక్రవారం పరామర్శించి ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి, తనకు అత్యుత్తమ మెరుగైన వైద్యం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కి గోపిక ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసిందని చెప్పారు. గోపిక కుడిచేతికి నిర్వహించిన క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతమైందని వైద్యులు ధృవీకరించారని తెలిపారు. మంత్రి లోకేష్ గోపికను సొంత బిడ్డలా భావించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని క్షణక్షణం పర్యవేక్షిస్తున్నారని.. ప్రభుత్వ అధికారులను ఆస్పత్రి వద్దే ఉంచి కుటుంబ సభ్యులకు కావాల్సిన అన్ని వసతులను సమకూరుస్తున్నామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆ పార్టీ నాయకుల తీరుపై మంత్రి సవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ రాజకీయం చేయాల్సిన చోట చేయాలని, ఆయన నైజం ఏంటో రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలుసని హితవు పలికారు. ఉన్మాద చర్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజలంతా కోరుకుంటుంటే, వైసీపీ నాయకులు మాత్రం అతడిని కాపాడేందుకు ప్రయత్నించడం దారుణమని మండిపడ్డారు. నిందితుడు హేమంత్‌ను రక్షించేందుకు కోర్టులో పిల్ వేయడమే వారి పక్షపాతానికి నిదర్శనమని ఆరోపించారు. చట్టం తన పని తాను చేసుకుపోతోందని, నిందితుడు విచారణ సమయంలో పోలీసులపై దాడికి తెగబడటంతోనే ఆత్మరక్షణార్థం పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని మంత్రి సవిత స్పష్టం చేశారు.



కౌంటింగ్ ప్రక్రియకు
సర్వం సిద్ధం

అమరావతి (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్‌లో సాగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ పడిన వేలాది మంది అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలనుంది. పోలింగ్ ప్రక్రియను ఎంత పకడ్బందీగా నిర్వహించారో, అంతే పక్కాగా, నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు పూర్తి చేసేందుకు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం సమగ్ర మార్గదర్శకాల ప్రకారం దాదాపు 30 వేల మందికి పైగా సిబ్బంది ప్రత్యక్షంగా ఈ లెక్కింపు ప్రక్రియలో పాలుపంచుకోనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రారంభమయ్యే ప్రక్రియలో తొలి ఫలితం వెలువడటానికి కనీసం నాలుగు గంటల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నిర్వహించిన పోలింగ్‌లో ఓటర్లు విస్తృతంగా పాల్గొని 70.72 శాతం మేర రికార్డుస్థాయి ఓటింగ్‌ను నమోదు చేశారు. ఇటీవలి వరదలు, భారీ వర్షాల కారణంతో పాటు ఇతర కారణాలతో పోలింగ్ వాయిదా పడిన స్థానాలు, పునఃపోలింగ్ నిర్వహించాల్సిన మండలాల్లో కూడా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. కౌంటింగ్ నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాలలో మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి 11 వేలకు పైగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, వారికి సహాయంగా 28,500 మంది కౌంటింగ్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వర్తించనున్నారు. లెక్కింపు కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధిస్తూ భద్రతను పటిష్టం చేశారు.



ఢిల్లీకి చేరిన తెలంగాణ కాంగ్రెస్
పంచాయతీలు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చోటుచేసుకున్న అంతర్గత విభేదాలు, పంచాయతీలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఏఐసీసీకి ప్రాథమిక నివేదికను సమర్పించారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యం, ఆధిపత్య పోరును సీరియస్‌గా తీసుకున్న టీపీసీసీ నాయకత్వం, వివిధ నియోజకవర్గాలు, అగ్రనేతల మధ్య నడుస్తున్న వివాదాల సమాచారాన్ని సేకరించి ఈ రిపోర్టులో పొందుపరిచింది. ఢిల్లీ వేదికగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య జరిగిన వివాదంతో పాటు, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ మంత్రి శ్రీధర్ బాబు మధ్య సాగుతున్న కోల్డ్ వార్‌పై కూడా నివేదిక ఇచ్చారు. అంతేకాకుండా, ప్రభుత్వ నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందంటూ అసంతృప్తి వ్యక్తం చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై కూడా ఏఐసీసీకి సమాచారం అందించారు. ఎమ్మెల్యే ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్నందున, ఆయన తిరిగి రాగానే గాంధీభవన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వీటితో పాటు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం, రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో నేతల మధ్య నెలకొన్న అంతర్గత సమస్యల జాబితాను కూడా ఈ నివేదికలో పొందుపరిచినట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు. త్వరలోనే వివాదాలతో సంబంధం ఉన్న ఇరువర్గాల నేతలతో ప్రత్యక్షంగా మాట్లాడి, సమగ్ర నివేదికను సిద్ధం చేసేందుకు గాంధీభవన్‌లో సయోధ్య ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అంతర్గత విభేదాలను వీలైనంత త్వరగా పరిష్కరించి పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు అధిష్ఠానం మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోనున్నారు.




గౌరవెల్లి ప్రాజెక్టుతో హుస్నాబాద్ ను
సస్యశ్యామలం చేస్తాం

హుస్నాబాద్ (ఏడీఎన్ఎన్) :

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగునీటి ప్రాజెక్టులతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కీలక విషయాలను వెల్లడించారు. 2007లో ప్రారంభమైన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులు మంజూరు చేయించామని, సుప్రీంకోర్టులో ఉన్న కేసును పరిష్కరించుకున్నామని చెప్పారు. కాలువల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని, గండిపల్లి ప్రాజెక్టు ద్వారా 14 వేల ఎకరాలకు నీరందిస్తామని వివరించారు.

రిమ్స్ బాధితులకు
కేటీఆర్ భరోసా

ఆదిలాబాద్ (ఏడీఎన్ఎన్) :



ఆదిలాబాద్ రిమ్స్ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. ఆదిలాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కంచనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగూడ గ్రామానికి చెందిన నిరుపేద, అత్యంత వెనుకబడిన ఆదివాసీ కొలాం వర్గానికి చెందిన కొడప దుర్గా మారుతి కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించి పార్టీ తరఫున రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి బాధితులకు ధైర్యం చెప్పూ, దుర్గా మారుతి కుటుంబానికి జరిగిన అన్యాయం చాలా బాధాకరమని అన్నారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేటీఆర్ నాయకత్వంలో తక్షణ సాయంగా ఈ రూ.లక్ష నగదు, దుస్తులు అందించినట్లు తెలిపారు.

కాళేశ్వరంపై అసెంబ్లీలో
చర్చకు సిద్ధం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆరోపించారు. పాలన చేతకాక చేతులెత్తేసి రెండో పంట వేయవద్దని చెబుతున్న రేవంత్ రెడ్డికి ప్రజలు రెండోసారి ఓటు వేయవద్దని కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష సాధింపుతో ప్రభుత్వం మరమ్మత్తులు చేయలేదని విమర్శించారు. మేడిగడ్డ రిపేర్లకు కేవలం మూడు నెలల సమయం పడుతున్నప్పటికీ, ముప్పై నెల్ల పాటు కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయని సెంట్రల్ వాటర్ రిసోర్స్ సంస్థ చెప్పినా పట్టించుకోకుండా నీటిని నింపుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, సభలో మైక్ కట్ చేయకుండా మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దితే
రూ.కోటి నజరానా

ములుగు జిల్లా (ఏడీఎన్ఎన్) :

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. పేదరికం లేని సమాజ నిర్మాణం, గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలంలో పర్యటించిన మంత్రి రూ. 3 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పలు సంక్షేమ పథకాలపై కీలక ప్రకటనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి సీతక్క తీపి కబురు అందించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు నిర్మాణ సామగ్రిని కూడా రాయితీ ధరలకు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో సిమెంట్ బస్తా ధర రూ. 300 నుండి రూ. 350 వరకు ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ. 230 నుండి రూ. 250 కే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ నుంచి సుమారు 4.5 లక్షల మందికి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అదేవిధంగా వెంకటాపూర్ మండలంలో అర్హులైన 11,863 మందికి ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషిచేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దితే ప్రభుత్వం నుంచి రూ. కోటి ప్రత్యేక నిధులు పొందవచ్చని వెల్లడించారు. వెంకటాపూర్ మండల పర్యటనలో భాగంగా నారాయణగిరిపల్లెలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, రామాంజపురంలో రూ. 1.35 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మంత్రి ప్రారంభించారు. అలాగే రూ. 1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అక్రమాలకు పాల్పడితే
వైద్యుల లైసెన్సులు రద్దు




హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో ఐవీఎఫ్ కేంద్రాల ముసుగులో జరుగుతున్న అక్రమాలు, ఆర్థిక దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. అండాల అక్రమ సేకరణ ముఠాలతో సంబంధాలు ఉన్న ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలను శాశ్వతంగా సీజ్ చేయాలని, అక్రమాలకు పాల్పడిన వైద్యుల లైసెన్సులను రద్దు చేసే ప్రక్రియను పరిశీలించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. కోటిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి కీలక సమీక్ష శుక్రవారం నిర్వహించారు. ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫారూఖీ పాల్గొన్న ఈ సమావేశంలో అండాల అక్రమ సేకరణ కేసుకు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. గతంలో సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో జరిగిన అక్రమాలను అరికట్టామని, తాజాగా దందాకు పాల్పడుతున్న ముఠాను గుర్తించామని తెలిపిన మంత్రి.. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సంతానలేమితో బాధపడుతూ ఐవీఎఫ్ సేవలను ఆశ్రయించే అమాయక దంపతులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దోపిడీని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రి ఉద్ఘాటించారు. అక్రమాల్లో భాగస్వాములైన వైద్యులపై స్టేట్ మెడికల్ కౌన్సిల్, నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులతో సంప్రదింపులు జరిపి వారి లైసెన్సుల రద్దుకు సిఫారసు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా, ఐవీఎఫ్ చికిత్సలో ఉపయోగించే మందుల తయారీ నుంచి అమ్మకాల వరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సరోగసి, అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ చట్టాల అమలును మరింత పటిష్టం చేసేందుకు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని, దీనికోసం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, సామాన్యులకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

కేపీహెచ్‌బీ భూముల వేలానికి కుట్ర

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



భవిష్యత్ తరాల కోసం వదిలిన భూములను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటోందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణలు చేశారు. హౌసింగ్ బోర్డు శాఖ వేలం ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న భూములను శుక్రవారం పరిశీలించిన ఆయన, విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కేపీహెచ్‌బీ కాలనీలో ఫైర్ స్టేషన్, పెట్రోల్ బంక్ వంటి ప్రజా అవసరాలు, ఇండోర్ స్టేడియంలు, పార్కుల కోసం కేటాయించిన రూ. 2 వేల కోట్ల విలువైన ఖాళీ స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం వేలానికి పెట్టడం దురదృష్టకరమని మండిపడ్డారు. హైదరాబాద్ నగర అవసరాలపై సరైన అవగాహన లేకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని, 'అలీబాబా అరడజను దొంగల' మాదిరిగా ప్రభుత్వ భూముల అమ్మకాలే లక్ష్యంగా కొందరు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ అక్రమ అమ్మకాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, విలేకరులపై కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు. మియాపూర్ భూముల విషయంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. హౌసింగ్ బోర్డు భూములను అమ్ముకోకుండా కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కృష్ణారావు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఈ స్థలాలను అమ్మేందుకు ప్రయత్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, టెండర్లలో పాల్గొనే వారిని అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రాణాలు పోయినా సరే ప్రజల తరఫున పోరాడి ప్రభుత్వ భూములను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, పలువురు మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను
సద్వినియోగం చేసుకోవాలి

సదాశివపేట (ఏడీఎన్ఎన్) :



సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు.సుమారు 22 ప్రముఖ కంపెనీలు పాల్గొన్న ఈ మేళాకు 420 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా, వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 191 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ యువత అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు.అలాగే నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.తర్వాత కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి కళాశాలలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా బాలికల వసతి గృహం, కంప్యూటర్ ల్యాబ్ అభివృద్ధి, ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టవలసిన అవసరాన్ని వివరించారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ, బాలికల హాస్టల్ నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తనవంతు సహాయంగా కళాశాలకు 10 కంప్యూటర్లు అందించడంతో పాటు, ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీ నిధుల నుండి సహకారం అందిస్తానని ప్రకటించారు.

ఐదు కొత్త పట్టణాలకు
ఇందిరమ్మ ఇళ్ల విస్తరణ

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ ప్రభుత్వం పేదల నివాసాల కోసం మరో కీలక నిర్ణయం తీసుకుంటూ 'ఇందిరమ్మ ఇళ్ల -టవర్స్' పథకాన్ని రాష్ట్రంలోని మరో ఐదు ప్రధాన పట్టణాలకు విస్తరించింది.నిజామాబాద్, వరంగల్, హన్మకొండ, నల్గొండ , మహబూబ్‌నగర్ పట్టణాలలో ఈ ఇళ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు ప్రకటిస్తూ ప్రభుత్వం జీఓ ఆర్టీ నంబర్ 579ను జారీ చేసింది. ఈ ఐదు పట్టణాల్లో మొత్తం 2,400 ఫ్లాట్లను నిర్మించేందుకు సర్కార్ అనుమతులు మంజూరు చేసింది. ఈ పథకం కింద ప్రతి పట్టణంలో 480 ఫ్లాట్ల చొప్పున G+5 (గ్రౌండ్ ప్లస్ 5) విధానంలో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ. 8.50 లక్షలుగా నిర్ణయించగా, ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ. 204 కోట్లుగా పేర్కొంది. ఇందులో అర్హులైన EWS, LIG కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కో యూనిట్‌పై రూ. 5 లక్షల వరకు సబ్సిడీ అందించనుండగా, లబ్ధిదారుల వాటాగా గరిష్ఠంగా రూ. 3.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ, అర్హుల పరిశీలన, లాటరీ విధానం నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం హౌసింగ్ బోర్డుకు అప్పగించింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల గుర్తింపు, కేటాయింపుల బాధ్యతలను సంబంధిత జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ అధికారులకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



గిరిజనుల కోసం
ప్రత్యేక ఎస్టీ కమిషన్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ రక్షణ సేన డిమాండ్‌కు తలొగ్గే ప్రభుత్వం ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చిందని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కలిపి ఒకే కమిషన్‌గా ఏర్పాటు చేయడం వల్ల అటు ఎస్సీలకు, ఇటు ఎస్టీలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని, ఈ విషయాన్ని తాము పలుమార్లు ప్రశ్నించామని ఆమె గుర్తుచేశారు. సమాజంలో ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సామాజిక, భౌగోళిక సమస్యలు పూర్తిగా వేర్వేరుగా ఉన్నాయని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. నేటికీ ఎస్సీలు సమాజంలో పీడన, అణచివేత, దౌర్జన్యాలను ఎదుర్కొంటుంటే, మరోవైపు ఆదివాసీలను రకరకాల పేర్లతో అడవి నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు తమ అస్తిత్వమైన 'జల్ జంగల్ జమీన్'పై హక్కులను కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఆదివాసీలు, గిరిజన సమాజ అభ్యున్నతి కోసం ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వారికి ఎంతో మేలు చేస్తుందని ఆమె చెప్పారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని, వారి ఆత్మగౌరవాన్ని, విశిష్టమైన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేలా పనిచేయాలని ఆమె కాంక్షించారు.



తెలంగాణలో ఇంటింటికీ
ఇంటర్నెట్ సేవలు

టీ-ఫైబర్' ప్రాజెక్టుకు రూ.3,185 కోట్ల కేంద్ర నిధులు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వపు అమోండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్రంలో రూరల్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రంతో ఒప్పందం పూర్తయింది. ఢిల్లీలోని సంచార్ భవన్‌లో జరిగిన తొలి బోర్డు సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,185 కోట్ల భారీ నిధులు సమకూరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'తెలంగాణ రాష్ట్ర రూరల్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్'ను ఏర్పాటు చేయనున్నారు. టీఫైబర్ ఎండీ పన్నీరు వేణు ప్రసాద్ ఈ కొత్త కార్పొరేషన్‌కు సీఈఓగా వ్యవహరించనున్నారు. టీఫైబర్ , కొత్త కార్పొరేషన్ సంయుక్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నాయి.



మైనార్టీల చదువుకు
సర్కార్ ఊతం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల విద్య, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధికి తమ ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించిందని పేర్కొన్నారు. ప్రజా భవన్‌లో షాదీ ముబారక్, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల అమలుపై మంత్రి అజారుద్దీన్‌తో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నాంపల్లి హజ్ హౌస్ పక్కన నిలిచిపోయిన అసంపూర్తి భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు రూ. 25 కోట్లు కేటాయించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ భవనంలో మైనార్టీ స్టడీ సర్కిల్, సంక్షేమ శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు మొఘల్‌పురా, బండ్లగూడ ప్రాంతాల్లో మరో రెండు కొత్త స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించిన ఫీజులు, బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మైనార్టీ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యా అవకాశాలను విస్తరించడంలో భాగంగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకంలోకి ఈజిప్ట్, సౌదీ అరేబియా దేశాలను కూడా చేర్చినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. అలాగే రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. క్రైస్తవ మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సైతం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

రాశి ఫలాలు

07-11-2026 శనివారం

మేషం:
భాగస్వామ్యాలను సమీక్షించి, పాత ఒప్పందాలు సరిచూసుకోవాలి. చెల్లింపులు , అప్పుల విషయంలో జాగ్రత్త వహించి సహనంతో బాధ్యతలు నిర్వర్తించాలి.

వృషభం:
ఆర్థిక బాధ్యతలు క్రమబద్ధీకరించుకుంటూ పొదుపుపై దృష్టి పెట్టాలి. విలాస వస్తువుల ఖర్చులు తగ్గించి పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

మిథునం:
కొత్త ఆలోచనలతో పెట్టుబడి అవకాశాలు పరిశీలిస్తారు. మార్కెటింగ్ , మీడియా రంగాల వారికి గొప్ప అవకాశాలు లభిస్తాయి.

కర్కాటకం:
గృహ ఖర్చులు , ఆస్తి వ్యవహారాలపై దృష్టి పెట్టి, భావోద్వేగ నిర్ణయాలకు దూరంగా ఉంటూ సరైన సమతుల్యత పాటించాలి.

సింహం:
ఆర్థిక చర్యలు , సంప్రదింపుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. ఆత్మ విశ్వాసంతో చొరవ తీసుకుని అమ్మకాలు , మార్కెటింగ్ లో రాణిస్తారు.

కన్య:
ఉద్యోగంలో స్థిరత్వంపై దృష్టి పెట్టి జీతం , చెల్లింపులపై చర్చలు జరుపుతారు. ఈమెయిల్లు , పత్రాలు జాగ్రత్తగా సమీక్షించాలి.

తుల:
వ్యక్తిగత ఆర్థిక ప్రాధాన్యతలపై శ్రద్ధ వహిస్తూ ఊహించని ఖర్చులు నియంత్రించాలి. కార్యాలయంలో సహోద్యోగులతో విభేదాలకు దూరంగా ఉండాలి.

వృశ్చికం:
తెర వెనుక పనిచేయడానికి ఇష్టపడి పెండింగ్ పనులు , రహస్య ప్రాజెక్టులపై దృష్టి పెడతారు. విదేశీ సంస్థలతో సంబంధాలు పెరుగుతాయి.

ధనస్సు:
వ్యాపార నెట్‌వర్క్ ల ద్వారా ఆర్థిక అవకాశాలు లభిస్తాయి. బృందంతో కలిసి పనిచేసి వృత్తిపరమైన లక్ష్యాలను చర్చించి విజయాలు సాధిస్తారు.

మకరం:
ఉద్యోగ ఆదాయం , దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి పెట్టి సామర్థ్యాలను నిరూపించుకుంటారు. ఉన్నతాధికారులతో గౌరవప్రదంగా ఉండాలి.

కుంభం:
విద్య , ప్రయాణాలకు సంబంధించిన ఆర్థిక అవకాశాలు లభిస్తాయి. కొత్త అవకాశాలు అన్వేషిస్తూ బాధ్యతలు పూర్తిగా అర్థం చేసుకోవాలి.

మీనం:
ఉమ్మడి ఆర్థిక వ్యవహారాలు , గత బాధ్యతలు పరిష్కరించుకుంటారు. పనిలో ఆకస్మిక మార్పులు ఎదురైనా ఓపికగా వ్యవహరించాలి.



వైసీపీ ఎమ్మెల్సీకి 14 రోజుల రిమాండ్

గుంటూరు (ఏడీఎన్ఎన్) :

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి గుంటూరు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలో పోలింగ్ ముగిసిన తర్వాత చోటుచేసుకున్న తీవ్ర ఆందోళనలు, ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు తర్వాత సాయంత్రం అప్పిరెడ్డికి గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వాదనలు పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత స్థానిక ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి తరలించేందుకు సిద్ధమవ్వగా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు ఇతర వైసీపీ నాయకులు, కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. ఈ ఆందోళనల కారణంగా గుంటూరు-నల్లపాడు ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించడమే కాకుండా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను అదుపులోకి తెచ్చి, అప్పిరెడ్డిని అరెస్ట్ చేశారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ఆదోని (ఏడీఎన్ఎన్) :

కర్నూలు జిల్లా ఆదోని పట్టణ సమీపంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. రెండు మోటార్ బైకులు అత్యంత వేగంగా ఎదురెదురుగా ఢీకొన్న దారుణ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాద ధాటికి తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరి పరిస్థితి కూడా అత్యంత విషమంగా మారినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానిక ప్రజలు , తీవ్రంగా గాయపడిన వారిని అత్యవసర వైద్య సహాయం నిమిత్తం తక్షణమే 108 వాహనంలో ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. విషయం తెలియగానే స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాద స్థలంలో ప్రాథమిక ఆధారాలు, వాహనాల వివరాలు సేకరించి, ప్రాణాలు కోల్పోయిన మృతుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశారు. తర్వాత మృతదేహాలను పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి శవాగారానికి తరలించారు. అధిక వేగమే ప్రమాదానికి కారణమా లేక మరేదైనా వైఫల్యం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపడుతున్నారు.





సంగారెడ్డిలో అంతరాష్ట్ర దోపిడీ ముఠా అరెస్టు

సంగారెడ్డి (ఏడీఎన్ఎన్) :

జాతీయ రహదారులపై ఒంటరిగా వెళ్తున్న వాహనదారులను లక్ష్యంగా చేసుకుని దారిదోపిడీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దారిదోపిడీ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని లాతూర్, పూణే, బారామతి ప్రాంతాలకు చెందిన నిందితులు హసన్ సమీర్ షేక్ (A1), సంతోష్ సెగర్ ధగుడు (A2), నౌషాద్ జాకీర్ సయ్యద్ (A3), రఫీక్ శంషుద్దీన్ షేక్ (A4) ఒక ముఠాగా ఏర్పడి ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ ముఠా రాత్రి సమయాల్లో జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ, అత్యవసరాల కోసం రోడ్డు పక్కన నిలిపి ఉంచిన కార్లను టార్గెట్ చేసేవారు. తమ వెంట తెచ్చుకున్న నకిలీ తుపాకీ, కత్తులతో కార్లలో ఉన్న వ్యక్తులను బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదును బలవంతంగా దోచుకునేవారు. ఆ తర్వాత ద్విచక్రవాహనంపై మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి పారిపోయి, దోచుకున్న ఆభరణాలను తెలిసిన వ్యక్తుల ద్వారా బంగారు దుకాణంలో విక్రయించి వచ్చిన డబ్బును పంచుకునేవారని ఎస్పీ వివరించారు. ఈ ముఠా అక్టోబర్ 17వ తేదీ రాత్రి సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని NH65 జాతీయ రహదారిపై ఆరూరు వద్ద నిలిపి ఉంచిన కారులోని వ్యక్తులను బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. అదే రోజు కోహీర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరొక కారును, అలాగే కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఇదే తరహాలో దారిదోపిడీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి నీలం రంగు యమహా బైక్, నకిలీ ఎయిర్ పిస్టల్, కొబ్బరిబొండం నరికే కత్తి, చెక్కపిడితో ఉన్న మరో కత్తి, 3 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి వేళల్లో నిర్జన ప్రాంతాల్లో వాహనాలను నిలిపి ఉంచరాదని, అత్యవసరమైతే పెట్రోల్ బంకులు, దాబాలు, హోటళ్లు వంటి జనసంచారం ఉండే సురక్షిత ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని ఎస్పీ సూచించారు. వాహనాలు బ్రేక్‌డౌన్ అయినప్పుడు వెంటనే డయల్ 112 లేదా జాతీయ రహదారి పెట్రోలింగ్ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సిసిఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ప్రాణస్నేహితుల ఆత్మహత్యాయత్నం



చిత్తూరు (ఏడీఎన్ఎన్) :

చిత్తూరు మున్సిపల్ పరిధిలోని కాకవేడు ఎస్టీ కాలనీలో చోటుచేసుకున్న హృదయవిదారక ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన ఎ. విజయక్ కుమార్తె మౌనిక (15), సెంథిల్ కుమార్తె జీవిత (17) బుధవారం సాయంత్రం అందరూ విస్తుపోయేలా విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. రాత్రి సమయంలో వారి అనారోగ్య పరిస్థితిని గుర్తించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలో, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మౌనిక ప్రాణాలు కోల్పోయింది. అపస్మారక స్థితిలో ఉన్న మరో బాలిక జీవితకు తొలుత నగరి ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ ప్రాణాలతో మృత్యువుతో పోరాడుతోంది. మౌనిక, జీవిత చిన్ననాటి నుంచే అత్యంత ప్రాణస్నేహితులుగా మెలిగేవారు. ఇరుగుపొరుగు ఇళ్లలోనే ఉండటంతో వారి మధ్య విడదీయలేని అనుబంధం ఏర్పడింది. మౌనిక తొమ్మిదో తరగతి వరకు చదివి మానేయగా, జీవిత పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేక ప్రస్తుతం ఇంటివద్దే ఉంటోంది. విధి వీరిద్దరిపైనా చిన్న వయసులోనే కన్నతల్లి ప్రేమను దూరం చేసింది. ఇద్దరూ చిన్న తనంలోనే తల్లులను కోల్పోవడంతో, ఒకరికొకరు తోడుగా నిలుస్తూ ఆ లోటును భర్తీ చేసుకున్నారు. ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. మౌనిక తండ్రి వద్ద ఉండగా, జీవిత తండ్రి దూర ప్రాంతంలో జీవనం సాగిస్తుండటంతో ఆమె అవ్వాతాతల వద్దే పెరుగుతోంది. ఎప్పుడూ కలిసే తిరిగే ఆ ఇద్దరు చిన్నారులు ఒకేసారి బలవన్మరణానికి పాల్పడటం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. అసలు ఆ చిన్నారుల మనసుల్లో అంతటి వేదన ఏముంది? తమ బాధను ఎవరికీ చెప్పుకోలేనంతటి కష్టం ఏమొచ్చిందనే ప్రశ్నలు ఇప్పుడు అంతుచిక్కని రహస్యంగా మిగిలిపోయాయి. ఈ హృదయ విదారక ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. బాలికల సెల్‌ఫోన్లలోని డేటాను, వాట్సాప్ చాట్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. ఈ తీవ్ర నిర్ణయానికి దారితీసిన బలమైన కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జీవిత పూర్తిగా కోలుకున్న తర్వాత ఆమె ఇచ్చే వాంగ్మూలం ద్వారా మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

పోలీసుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక యాప్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

నిరంతర విధులు, పని ఒత్తిడి కారణంగా పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపే అవకాశం తక్కువగా ఉంటుందని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించగలరని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా 'ఫిట్ కాప్' విధానాన్ని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టారు. డీజీపీ కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు, ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ నూతన కార్యక్రమ వివరాలను వెల్లడించారు.పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌గా రూపొందించిన ఈ ప్రత్యేక యాప్ ఆధారిత విధానాన్ని



రాబోయే 30 నుంచి 45 రోజుల్లోగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ యాప్‌లో ఎనిమిది ప్రధాన ఆరోగ్య అంశాలకు సంబంధించిన ప్రశ్నలతో పాటు వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 90 వేలకు పైగా పోలీసు సిబ్బంది తమ సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా ఇందులో వివరాలు నమోదు చేసుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, బీఎంఐ, జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి అంశాల ఆధారంగా సిబ్బందిని తక్కువ, మధ్యస్థ, అధిక ఆరోగ్య ముప్పు విభాగాలుగా వర్గీకరిస్తారు. ఆరోగ్య ప్రమాద స్థాయిని బట్టి కాల్ సెంటర్ ద్వారా సంబంధిత సిబ్బందిని ఫోన్ ద్వారా అప్రమత్త చేయడంతో పాటు వైద్య పరీక్షలు, ఆసుపత్రుల ద్వారా చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తారని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఫౌండర్ సల్మాన్ వివరించారు.కిడ్నీ సమస్యలు, బీపీ, షుగర్ వంటి వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంలో ఈ విధానం కీలకంగా నిలుస్తుందని డీజీపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన క్యాజ్‌వే



అనకాపల్లి (ఏడీఎన్ఎన్) :

అనకాపల్లి జిల్లాలో కురిసిన భారీ వర్షాల ధాటికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాల తీవ్రతకు చోడవరం వద్దాది ప్రధాన రహదారి మధ్య ఉన్న విజయరామరాజుపేట వద్ద గల క్యాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. క్యాజ్‌వే ప్రవాహంలో కొట్టుకుపోవడంతో చోడవరం నుంచి వద్దాది, విశాఖపట్నం వైపు వెళ్లే అన్ని రకాల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనివల్ల ప్రయాణికులు, వాహనదారులు ,స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు సమస్యను పూర్తిగా గాలికి వదిలేశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తాత్కాలికంగా రాకపోకలను పునరుద్ధరించడమే కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఎత్తైన నూతన వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. విజయరామరాజుపేట రహదారి సమస్య ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే ప్రతి వర్షాకాలంలోనూ తమ గ్రామానికి ఈ దుస్థితి పునరావృతమవుతోందని మండిపడ్డారు. ఈ రహదారి విశాఖపట్నం, అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాలను కలిపే ప్రధాన అంతర్‌జిల్లా రహదారి కావడంతో నిత్యం వేలాది మంది వ్యాపారులు, ఉద్యోగులు, నిరుద్యోగులు , పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన 'వంజంగి మేఘాల కొండల'కు వెళ్లే పర్యాటకులు సైతం ఇదే మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది. ప్రస్తుతం క్యాజ్‌వే ధ్వంసమవ్వడంతో వంజంగి వెళ్లే పర్యాటకుల ప్రయాణ కష్టాలు మరింత తీవ్ర రూపం దాల్చాయని స్థానికులు వెల్లడించారు.



బియ్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించడంతో పాటు ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కిలో బియ్యాన్ని రూ.66, రూ.74, రూ.79 చొప్పున మూడు రకాల ధరలకు విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా మొత్తం 10 విక్రయ కేంద్రాలను ప్రారంభించగా, మలక్‌పేటలోని నేహా రైస్ ట్రేడర్స్ విక్రయ కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి కె.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించే ఉద్దేశంతో సరుకులను అక్రమంగా నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులను మోసం చేసే వ్యాపారులపై నిఘా పెంచినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు లీగల్ మెట్రాలజీ అధికారులు 450 తనిఖీలు నిర్వహించి, 25 లీగల్ మెట్రాలజీ కేసులు, 17 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిర్ణిత ధరల కంటే ఎక్కువగా వసూలు చేసినా, తుకాల్లో మోసాలకు పాల్పడినా, నిత్యావసర సరుకులను అక్రమంగా నిల్వ ఉంచిన ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ధరల నియంత్రణతో పాటు సామాన్యులకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు వినియోగదారులకు కొంత ఊరటనిస్తున్నాయి.

హైటెక్స్‌లో ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్'

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ప్రపంచ స్థాయి వేదికకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. ఈనెల 12, 13, 14 తేదీలలో నగరంలోని ప్రసిద్ధ 'హైటెక్స్' ప్రాంగణంలో ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్' నిర్వహించనున్నారు. వివిధ దేశాల మధ్య సత్సంబంధాలను మరింత పెంపొందించడం, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాల నుంచి దౌత్యవేత్తలు,ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సు కోసం దాదాపు 450 మంది విశిష్ట అతిథులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర



ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులతో పాటు కాంగ్రెస్ జాతీయ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు శశి థరూర్ తదితర రాజకీయ, దౌత్య రంగాల ప్రముఖులు హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌లో అంతర్జాతీయ సంబంధాలు, ఆర్థిక పురోగతి, గ్లోబల్ పార్టనర్‌షిప్‌పై కీలక చర్చలు జరగనున్నాయి.



సీఎంను కలిసేందుకు 350 కి.మీ పాదయాత్ర

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకోవాలన్న బలమైన ఆకాంక్షతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయన్న అనే అభిమాని ఏకంగా కాలినడకన హైదరాబాద్ చేరుకున్నారు. ఆదోని నుంచి దాదాపు 350 కిలోమీటర్ల మేర 9 రోజుల పాటు సుదీర్ఘంగా పాదయాత్ర చేసి జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిశారు. అక్టోబర్ 29న ఆదోని నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించిన తాయన్న, శుక్రవారం నాడు హైదరాబాద్ చేరుకొని సీఎం రేవంత్ రెడ్డిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాయన్నను ఆప్యాయంగా పలకరించి, శాలువా కప్పి అభినందించారు.



హైదరాబాద్‌లో కల్తీ పాల కలకలం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

భాగ్యనగరంలో ప్రజల ఆరోగ్యాన్నే పణంగా పెడుతూ సాగుతున్న కల్తీ పాల తయారీ గుట్టును ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచారం గ్రామంలో అక్రమంగా కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పాల వ్యాపారమే వృత్తిగా చేసుకున్న ఆందే శ్రీశైలం (43) అనే వ్యక్తి నివాసంపై దాడులు చేసిన అధికారులు, ఆయన ప్రాణాంతక రసాయనాలు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. మానవ ఆరోగ్యానికి హాని కలిగించే హైడ్రోజన్ పెరాక్సైడ్, ధోల్‌పూర్ పాలపొడిని నీటిలో కలిపి కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు తేలింది. ఈ విధంగా తయారు చేసిన కృత్రిమ పాలను హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల వినియోగదారులకు నిత్యం సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సదరు కేంద్రం నుంచి 100 లీటర్ల కల్తీ పాలు, 1 లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్ , 35 కిలోల ధోల్‌పూర్ పాలపొడి ప్యాకెట్లను పోలీసులు సీజ్ చేశారు. నిందితుడు ఆందే శ్రీశైలంను అదుపులోకి తీసుకుని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కల్తీ పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు.

కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ



అనంతపురం (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను అధికార కూటమి ప్రభుత్వం పోలీసుల లారీలు, అక్రమ నిర్బంధాలు, అధికారుల దుర్వినియోగంతో పూర్తిగా ప్రహసనంగా మార్చేసిందని వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎదుట శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కోవడం, వేసిన నామినేషన్లలో 30 శాతానికి పైగా ఆర్వోలపై ఒత్తిడి తెచ్చి తిరస్కరింపజేయడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పోలింగ్ రోజున వేలాది మంది ఏజెంట్లు, ముఖ్య నాయకులతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను రాత్రికి రాత్రే ఇళ్లలోనే హౌస్ అరెస్టులు చేశారని విమర్శించారు. 'రెడ్ బుక్ రాజ్యాంగం' పేరుతో నడుస్తున్న ఈ పాలనలో ప్రజల స్వేచ్ఛా హక్కులపై కాకీ చొక్కాలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం దాడి చేస్తోందని, ఇది 1975 నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తోందని మండిపడ్డారు. స్థానిక పోరులో సుప్రీంకోర్టు ఇచ్చిన సీసీటీవీ నిఘా ఆదేశాలను కూటమి ప్రభుత్వం పూర్తిగా బేఖాతరు చేసిందని, కేవలం 50 శాతం కేంద్రాల్లోనే కెమెరాలు పెట్టి ఆ ఫుటేజ్‌ను దాచిపెట్టారని తోపుదుర్తి ఎండగట్టారు. ధర్మవరంలో కేవలం రెండు గంటల్లో 30 వేల ఓట్లు, చిలకలూరిపేటలో 20 వేల ఓట్లు పడటం గిన్నిస్ బుక్ రికార్డును తలపిస్తోందని ఎద్దేవా చేసిన ఆయన, విశాఖపట్నంలో అర్ధరాత్రి వేళ అదనంగా 1.15 లక్షల ఓట్లు పెరగడం ఏకపక్ష రిగ్గింగ్‌కు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో మాజీ మంత్రి పరిటాల సునీత వర్గీయులు పోలీసుల అండతో వైసీపీ ఏజెంట్లను అడ్డుకోవడంతో ఉదయమే తమ అభ్యర్థులు పోలింగ్‌ను బహిష్కరించారని గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజాస్వామ్యాన్ని తొక్కివేస్తున్న కూటమి నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

ప్రపంచకప్ లక్ష్యంగా
కివీస్ పర్యటన

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



వచ్చే ఏడాది జరగబోయే మెగా టోర్నీని దృష్టిలో ఉంచుకుని, న్యూజిలాండ్ సిరీస్‌ను ఒక మంచి సన్నాహకంగా ఉపయోగించుకుంటున్నట్లు భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపారు. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలలో వాతావరణ పరిస్థితులు దాదాపు ఒకేలా ఉండటం తమకు కలిసివచ్చే అంశమని, 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్ నవంబర్ మధ్య జరగనున్న నేపథ్యంలో ఈ పర్యటనలు తమకు ఎంతో అనుభవాన్ని ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. న్యూజిలాండ్ పిచ్‌లపై బంతి బాగా స్వింగ్ అవుతూ మంచి బౌన్స్ లభిస్తుందని గిల్ విశ్లేషించారు. అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్ వంటి భారత పేసర్లు ఇక్కడి కండిషన్స్ కు తగిన నైపుణ్యాన్ని కలిగి ఉన్నారని, తొలి మ్యాచ్‌లోనే తాము దానిని చూశామని చెప్పారు. ఈ సిరీస్ అంతటా మన పేసర్లు అద్భుతంగా రాణిస్తారనే గట్టి నమ్మకం తమకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల కివీస్‌తో ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3-2 తేడాతో కైవసం చేసుకోవడంపై గిల్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ పొట్టి సిరీస్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన శ్రేయస్ అయ్యర్ జట్టును అద్భుతమైన రీతిలో నడిపించాడని ఆయన ప్రశంసించారు. చివరి రెండు టీ20లలో ఓటమి ఎదురైనప్పటికీ, వన్డే సిరీస్‌లో అడుగుపెట్టిన మొదటి మ్యాచ్‌లోనే ఘన విజయం సాధించడం ద్వారా జట్టులో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయిందని, ఫలితంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఎంతో సానుకూల వాతావరణం ఏర్పడిందని గిల్ వెల్లడించారు.

కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

బిహార్ సీనియర్ పురుషుల క్రికెట్ రంజీ, టీ20 జట్టు నాయకత్వంలో కీలక మార్పు జరిగింది. సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ 2026 టోర్నమెంట్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లకు గాను 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని బిహార్ జట్టు కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు బిహార్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. నవంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్‌లో బిహార్ తమ తొలి మ్యాచ్‌లో సౌరాష్ట్రతో, నవంబర్ 16న రైల్వేస్‌తో తలపడనుంది. ఈ టోర్నమెంట్ కోసం బీసీఏ ప్రెసిడెంట్ హర్ష్ వర్ధన్ 17 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించగా, సూరజ్ కశ్యప్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైభవ్ చిన్న వయస్సులోనే అద్భుతమైన ప్రతిభ, ఆత్మవిశ్వాసం, పరిణతి చూపించాడని, ఈ కెప్టెన్సీ బాధ్యత అతనికి ఒక ఆటగాడిగానే కాకుండా నాయకుడిగా కూడా ఎదగడానికి మంచి అవకాశాన్ని ఇస్తుందని హర్ష్ వర్ధన్ పేర్కొన్నారు. అతని నేతృత్వంలో జట్టు క్రమశిక్షణతో కూడిన ప్రతిభను కనబరుస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. వైభవ్ సూర్యవంశీ కెరీర్ ఇటీవలి కాలంలో అనూహ్య మలుపు తిరిగింది. 2026 అండర్ 19 పురుషుల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్లో 175 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు ట్రోఫీ అందించడమే కాకుండా 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు. ఆ తర్వాత IPL 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతూ 237.30 స్ట్రైక్ రేట్‌తో 776 పరుగులు చేసి, ఆ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ సంచలన ప్రదర్శనల ఫలితంగా జూలైలో మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 ద్వారా భారత జాతీయ జట్టులో అరంగేట్రం చేసి, దేశం తరఫున ఆడిన అతిపిన్న వయస్కుడైన అంతర్జాతీయ క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా, ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ శర్మతో కలిసి మొదటి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించి, పురుషుల టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో పవర్‌ప్లేలో అత్యధిక పరుగులు చేసిన జోడీగా రికార్డు నమోదు చేశారు. నవంబర్ 4 నుండి 6 వరకు నిర్వహించిన ట్రయల్స్, ఆటగాళ్ల గత ప్రదర్శన ఆధారంగా బిహార్ సీనియర్ సెలక్షన్ కమిటీ శుక్రవారం ఈ 17 మంది సభ్యుల జట్టును



ఖరారు చేసింది. మంగళ్ మహూర్, ఫాస్ట్ బౌలర్ షకీబ్ హుస్సేన్‌ల ఎంపిక ఫిట్‌నెస్‌కు లోబడి ఉంటుందని, మొదటి రెండు మ్యాచ్‌ల తర్వాత వారి లభ్యతను పర్యవేక్షించి పరిశీలిస్తామని స్పష్టం చేశారు. వీరితో పాటు మరో 16 మంది ఆటగాళ్లను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు.



యువ ఆసియా కప్‌లో
భారత్ ఘన విజయం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఒమన్ దేశంలోని మస్కట్‌లో శుక్రవారం జరిగిన ఏసీసీ మెన్స్ అండర్19 ఆసియా కప్ 2026 గ్రూప్‌ఎ ప్రారంభ మ్యాచ్‌లో భారత్ జట్టు అద్భుత విజయం సాధించింది. నేపాల్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసి, టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్ జట్టు నిర్ణయించిన ఓవర్లలో 128 పరుగులకు కుప్పకూలింది. అనంతరం 129 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు ఎలాంటి తడబాటుకు గురవకుండా సులభంగా విజయాన్ని అందుకుంది. మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ తన తండ్రిని తలపించేలా శక్తివంతమైన బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఆర్యవీర్ 52 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 70 పరుగులు సాధించాడు. మరోవైపు కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని కూడా బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి 63 బంతుల్లో 53 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇద్దరూ కలిసి అజేయమైన భాగస్వామ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ విజయంతో జోరుమీదున్న భారత అండర్19 జట్టు, తన తదుపరి మ్యాచ్‌లో పాక్ తో ఆదివారం తలపడనుంది.

దూస్రా' సినిమా నిర్మాతలకు ఢిల్లీ హైకోర్టు షాక్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

టీమిండియా మాజీ దిగ్గజ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యక్తిగత హక్కుల ఉల్లంఘనకు సంబంధించి 'దూస్రా' సినిమాపై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ చిత్రంలో తన వ్యక్తిగత గుర్తింపును, పర్సనాలిటీని వాణిజ్యపరంగా దుర్వినియోగం చేశారని పేర్కొంటూ గంగూలీతో పాటు ఆయన బయోపిక్‌ను నిర్మిస్తున్న 'లవ్ ఫిలింస్ ఎల్ఎల్‌పి' సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ తేజస్ కరియా.. 'దూస్రా' మూవీ ప్రాథమికంగా గంగూలీ పర్సనాలిటీ హక్కులను ఉల్లంఘించిందని స్పష్టం చేశారు. ఈ



సినిమా కేవలం చారిత్రక సంఘటనల చిత్రీకరణకే పరిమితం కాలేదని, వాణిజ్యపరంగా గంగూలీ ఇమేజ్‌ను వాడుకున్నారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఇప్పటికే విడుదలైన ఈ సినిమా థియేట్రికల్ ప్రదర్శనను నిలిపివేయడానికి కోర్టు నిరాకరించింది. అయితే, చిత్ర నిర్మాణ సంస్థకు కొన్ని కఠిన షరతులు విధించింది. సినిమాలో తగిన ప్రకటనను జోడించాలని, అలాగే రూ. 2 కోట్ల బ్యాంకు గ్యారెంటీని సమర్పించాలని ఆదేశించింది. ఇండియాస్ అదర్ ఫ్రీడమ్ స్ట్రగుల్' చిత్రంలో ప్లాబితా బోర్తాకుర్, అంకుర్ వికల్, సమిధా గురు కీలక పాత్రల్లో నటించారు. ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఈ తాజా ఉత్తర్వులతో ఈ వివాదం ప్రస్తుతం క్రీడా, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



వీడియోకాన్ వేణుగోపాల్
ధూత్ దివాలా

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

వీడియోకాన్ ఇండస్ట్రీస్ మాజీ ప్రమోటర్, డైరెక్టర్ వేణుగోపాల్ ధూత్ దివాలా తీసినట్లు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ముంబయి బెంచ్ అధికారికంగా ప్రకటించింది. వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియ, రుణ చెల్లింపు ప్రణాళిక పూర్తిగా విఫలమవడంతో దివాలా స్మృతి నిబంధనల ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఎన్‌సీఎల్‌టీ ఈ కీలక నిర్ణయాన్ని వెలువరించింది. వీడియోకాన్ ఇండస్ట్రీస్, వీడియోకాన్ టెలికమ్యూనికేషన్స్ వంటి గ్రూప్ సంస్థలు పొందిన రుణాల కోసం ధూత్ పర్సనల్ గ్యారంటీలు ఇచ్చారు. అయితే కంపెనీలు డిఫాల్ట్ అవ్వడంతో 2018 ఫిబ్రవరిలోనే బ్యాంకులు తమ క్లెయిమ్‌లను నమోదు చేశాయి. ఈ ప్రక్రియలో భాగంగా సిలిగురిలోని ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ ద్వారా 36 నెలల కాలంలో రూ. 600 కోట్లు చెల్లిస్తానని ధూత్ ప్రతిపాదించినప్పటికీ.. ఎలాంటి ముందస్తు చెల్లింపు ప్రణాళిక లేకపోవడం, భవిష్యత్ చెల్లింపులపై స్పష్టమైన హామీలు కనిపించకపోవడంతో రుణదాతలు ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. రుణదాతలు పునరుద్ధరణ ప్లాన్‌ను తిరస్కరించడంతో పాత పరిష్కార ప్రక్రియను ముగిసిపోయినట్లు పేర్కొంటూ పూర్తిస్థాయి దివాలా చర్యలు చేపట్టేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతినిచ్చింది. ఈ దివాలా ప్రక్రియను పర్యవేక్షించడానికి ఆశిష్ నారాయణను దివాలా ట్రస్టీ గా బెంచ్ నియమించింది. బాకీ పడిన బ్యాంకులు, క్రెడిటర్ల నుంచి క్లెయిమ్‌లను ఆహ్వానించి 90 రోజుల్లోగా ప్రాథమిక నివేదికను ధర్మసనానికి సమర్పించాలని ట్రస్టీని ఆదేశించింది. అలాగే తన వద్ద ఉన్న సమగ్ర ఆర్థిక వివరాలు, ఆస్తులు, అప్పుల నివేదికలను 7 రోజుల్లోగా సమర్పించాలని వేణుగోపాల్ ధూత్‌ను ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. ఈ వ్యక్తిగత దివాలా ప్రక్రియ కింద ఎస్‌బీఐ ఒకటే ఏకంగా రూ. 12,668 కోట్ల బకాయిలను కోరుతోంది.

చాట్‌జీపీటీపై మర్డర్ కేసు ?

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

భార్యాభర్తల నడుమ వివాదాలు, భర్తల హత్యల ఉదంతాలు ఈ మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతున్న వేళ.. అమెరికాలో కృత్రిమ మేధ సాంకేతికత చుట్టూ అత్యంత దిగ్భ్రాంతికరమైన వివాదం వెలుగులోకి వచ్చింది. తనను దారుణంగా హత్య చేసేందుకు తన భార్యకు ఏఐ చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' ప్రత్యక్షంగా సహకరించిందని ఆరోపిస్తూ నార్త్ కరోలినాకు చెందిన జేమ్స్ గేట్స్ అనే వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. శాన్‌ఫ్రాన్సిస్కో కౌంటీ సుపీరియర్ కోర్టులో దాఖలైన ఈ సంచలన దావాలో చాట్‌జీపీటీ మాతృ సంస్థ 'ఓపెన్‌ఏఐ'తో పాటు దాని సీఈఓ సామ్ ఆల్ట్ మన్‌ను కూడా జేమ్స్ ప్రతివాదిగా చేర్చడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. బాధితుడు జేమ్స్ గేట్స్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన భార్య చెరిల్ గేట్స్ తొలుత వృత్తిపరమైన పనివేళలు, ఇంటి అవసరాల కోసం చాట్‌జీపీటీని వాడేవారు. అయితే దంపతుల మధ్య విభేదాలు, విడాకుల చర్చలు మొదలైన తర్వాత వైవాహిక సమస్యలపై చాట్‌బాట్‌ను సంప్రదించడం ప్రారంభించారు. ఈ క్రమంలో చాట్‌జీపీటీ ఆమె అనుమానాలను నిరంతరం పెంచుతూ, భర్తపై అపనమ్మకాన్ని ప్రోత్సహించింది. అంతటితో ఆగకుండా ఒలియాండర్ (గన్నేరు) మొక్కల విషపూరిత లక్షణాలు, కొన్ని ఔషధాల ప్రభావాలు, భర్తకు తెలియకుండా వాటిని ఆహారంలో ఎలా కలపొచ్చనే అంశాలపై సైతం సమగ్ర సమాచారం అందించింది. శవపరీక్షలో విషప్రయోగాన్ని గుర్తించగలరా అనే ప్రశ్నకూ చాట్‌బాట్ మార్గదర్శనం చేసినట్లు స్క్రీన్‌షాట్ల ద్వారా దావాలో వెల్లడించారు. ఈ ప్రయోగాల ఫలితంగా 2025లో జేమ్స్ తీవ్రమైన గుండె సమస్యలు, కడుపునొప్పి, గందరగోళానికి గురయ్యారు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో భార్య చేతిరాతతో ఉన్న ఒక నోట్‌ను గుర్తించగా.. అందులో విషపూరిత పదార్థాల మోతాదులతో పాటు "చాట్‌జీపీటీ సంభాషణలన్నీ డిలీట్ చేయాలి", "అకౌంట్ లాగ్‌అవుట్ కావాలి" అని రాసి ఉండటంతో విషయాన్ని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణ ఆధారంగా 2025లో చెరిల్‌పై హత్యాయత్నం, ఆహారంలో విషం కలిపారనే తీవ్ర అభియోగాలు నమోదయ్యాయి. అయితే తగిన ఆధారాలు లభించలేదనే కారణంతో ప్రాసిక్యూటర్లు 2026 ఏప్రిల్‌లో ఆమెపై ఉన్న క్రిమినల్ కేసును ఉపసంహరించుకున్నారు. క్రిమినల్ కేసు తొలగిపోయినప్పటికీ, చాట్‌జీపీటీ ప్రమాదకరమైన సమాచారాన్ని అందించకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోలేదని జేమ్స్ ఓపెన్‌ఏఐపై సివిల్ దావా వేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఓపెన్‌ఏఐ.. వినియోగదారుల ప్రాణ రక్షణ, భద్రత తమకు అత్యంత ప్రాధాన్య అంశాలని స్పష్టం చేసింది. వివాదాస్పద రీతిలో ప్రవర్తించిన సదరు ఖాతాను ఇప్పటికే నిషేధించామని, పోలీసు దర్యాప్తునకు పూర్తి సమాచారాన్ని అందించామని



వెల్లడించింది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఏఐ చాట్‌బాట్‌ల వల్ల మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తడం, హింసాత్మక చర్యలకు ప్రోత్సాహం లభించడంపై పలు సంస్థలు, బాధిత కుటుంబాలు న్యాయపోరాటం చేస్తుండగా, జేమ్స్ గేట్స్ దావా ఈ ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది.



రేసింగ్ ట్రాక్‌పై ముంబై
కుర్రాడి సంచలనం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ముంబై వేదికగా జరిగిన 'ఎఫ్1 సిమ్ రేసింగ్ ఇండియా ఓపెన్ 2026' జాతీయ ఫైనల్స్‌లో ముంబైకి చెందిన 10 ఏళ్ల విహాన్ జోషి అండర్15 విభాగంలో ఛాంపియన్‌గా నిలిచాడు. ఎన్ఎస్సీఐ డోమ్ లో జరిగిన ఈ పోటీలలో ముంబైకే చెందిన అగస్త్య క్రాస్తో రెండో స్థానాన్ని సాధించగా, పుణెకు చెందిన హృదాన్ సనాధ్య మూడో స్థానాన్ని కైవసం చేసుకుని పోడియంపై నిలిచారు. ముంబై ఫాల్కన్స్ రేసింగ్ లిమిటెడ్, ఫార్ములా 1 భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ టోర్నీ ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న దిగ్గజ యంగ్ సిమ్ రేసింగ్ ప్రతిభావంతులు ఒకే వేదికపైకి వచ్చారు. ముంబైలోని పోదార్ ఓఆర్టి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి అయిన విహాన్ జోషి, క్వాలిఫైయింగ్ రౌండ్ల నుంచి చివరి వరకు అద్భుతమైన ఫామ్‌ను కనబరిచాడు. ఫైనల్స్ లోని మొత్తం ఆరు రేసుల్లో ఐదింటిని గెలుచుకుని 134 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. ఈ అండర్ 15 ఛాంపియన్‌షిప్‌ను MFRL ప్రారంభించిన 'వన్ ఇన్ ఎ బిలియన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. ప్రతిభ కలిగిన యంగ్ రేసర్లకు సిమ్ రేసింగ్ నుండి రియల్ వరల్డ్ మోటార్ స్పోర్ట్స్ కార్టింగ్ ప్రోగ్రామ్‌లోకి వెళ్లే అవకాశాన్ని ఈ వేదిక కల్పిస్తుంది. మరోవైపు 20 మంది టాప్ రేసర్లతో కూడిన ఓపెన్ (సీనియర్) విభాగం జాతీయ ఫైనల్స్ కూడా ముగియనున్నాయి. ఈ సీనియర్ విభాగంలో నిలిచిన టాప్ ఇద్దరు విజేతలు నవంబర్ 7 నుండి 9 వరకు జరగనున్న అంతర్జాతీయ 'కప్ ఆఫ్ నేషన్స్' టోర్నమెంట్‌లో భారత దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. రాబోయే దశాబ్దంలో భారతదేశం నుంచి తదుపరి ఫార్ములా 1 డ్రైవర్‌ను తయారు చేయడమే లక్ష్యంగా ముంబై ఫాల్కన్స్ ఈ పటిష్టమైన రేసింగ్ వ్యవస్థను తీర్చిదిద్దుతోంది.

ఫ్యూచర్ గ్రూప్ కిషోర్ బియానీకి బిగ్ షాక్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఫ్యూచర్ గ్రూప్ వ్యవస్థాపకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కిషోర్ బియానీకి మరో అతి పెద్ద న్యాయపరమైన చిక్కు ఎదురైంది. సుమారు రూ. 904.32 కోట్ల మేర బ్యాంకింగ్ మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనతో పాటు 'ఫ్యూచర్ రిటైల్ లిమిటెడ్' యాజమాన్యంపై కేంద్రీయ దర్యాప్తు సంస్థ కేసు నమోదు చేసింది. ఈ సంచలన కేసులో కిషోర్ బియానీతో పాటు ఆయన సోదరుడు, ఫ్యూచర్ గ్రూప్‌లోని మరొక కీలక ప్రమోటర్ రాకేశ్ బియానీ పేరును కూడా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. కేసు నమోదు చేసిన తదుపరి చర్యల్లో భాగంగా ముంబైలోని బియానీ నివాసాలతో పాటు కంపెనీకి చెందిన పలు కీలక కార్యాలయాల్లో సీబీఐ అధికారులు విస్తృత సోదాలు నిర్వ



హించి, కేసు దర్యాప్తునకు ఉపయోగపడే అనేక కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబైలోని స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్III అందించిన రాతపూర్వక ఫిర్యాదు ఆధారంగా సీబీఐ అధికారులు ఈ విచారణకు శ్రీకారం చుట్టారు. ఎస్‌బీఐ నాయకత్వంలో మొత్తం 9 బ్యాంకులతో కూడిన కన్సార్టియం నుంచి ఫ్యూచర్ రిటైల్ సంస్థ వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, టర్మ్ లోన్లు, లెటర్స్ ఆఫ్ క్రెడిట్ రూపంలో భారీగా రుణ సదుపాయాలు పొందింది. అయితే, ఏ అవసరాల కోసం బ్యాంకుల నుంచి నిధులు తీసుకున్నారో వాటికి కాకుండా, అనుబంధ కంపెనీలు, సంబంధిత నిబంధనలు లేని సంస్థల ద్వారా రుణ మొత్తాలను అడ్డగోలుగా దారి మళ్లించి స్వాహా చేశారని ఎస్‌బీఐ ఆరోపించింది. దీనివల్ల బ్యాంకింగ్ వ్యవస్థకు రూ. 904.32 కోట్ల భారీ నష్టం వాటిల్లింది. నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి నిరోధక చట్టం నిబంధనల కింద కిషోర్ బియానీతో పాటు కొంతమంది ప్రభుత్వ అధికారుల ప్రమేయంపైనా సీబీఐ లోతైన విచారణ జరుపుతోంది.



రూ.10 వేలకే మూడేళ్ల
లాంగ్ టర్మ్ ప్రీపెయిడ్ ప్లాన్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

దేశీయ ప్రముఖ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో తన వినియోగదారుల కోసం ఒకేసారి మూడేళ్ల (1,095 రోజులు) వ్యాలిడిటీతో పనిచేసే సరికొత్త లాంగ్ టర్మ్ ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కొత్త ప్లాన్ ధరను కంపెనీ రూ.10,000గా నిర్ణయించింది. సాధారణంగా టెలికాం కంపెనీలు గరిష్ఠంగా ఏడాది (365 రోజులు) వ్యాలిడిటీ ఉన్న వార్షిక ప్లాన్‌లను మాత్రమే అందిస్తాయి. అయితే వినియోగదారులు పదే పదే రీఛార్జ్ చేసుకునే అవసరం లేకుండా, తొలిసారి ఏకంగా 3 సంవత్సరాల సుదీర్ఘ కాలవ్యవధితో ప్లాన్‌ను పరిచయం చేయడం టెలికాం రంగంలో విశేషంగా మారింది. ఈ ప్లాన్ ద్వారా చందాదారులు రోజుకు 2.5 జీబీ చొప్పున హైస్పీడ్ 4జీ డేటాతో పాటు అపరిమిత 5జీ డేటాను ఉపయోగించుకోవచ్చు. దీనితో పాటు ప్రతిరోజూ 100 ఉచిత ఎస్సెమ్మెస్‌లు, ఉచిత ఆల్‌నెట్‌వర్క్ అన్‌లిమిటెడ్ కాల్స్ లభిస్తాయి. లెక్కించి చూస్తే ఈ ప్లాన్ ద్వారా వినియోగదారుడికి రోజువారీ ఖర్చు కేవలం రూ.9.1 మాత్రమే పడుతుంది. కనెక్టివిటీ ప్రయోజనాలతో పాటు వినియోగదారులకు వినోదం, డిజిటల్ ఉత్పత్తులను జియో ఈ ప్లాన్ ద్వారా ఉచితంగా అందిస్తోంది. ఇందులో భాగంగా జియో హాట్‌స్టార్ మొబైల్ (హాలీవుడ్ యాక్సెస్ సహా) ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను కంపెనీ పొందుపరిచింది. దీనికి తోడు క్రియేటర్లు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే 'కాన్వా ప్రో లైట్' సబ్‌స్క్రిప్షన్‌ను కూడా 12 నెలల పాటు ఉచితంగా ఆనందించవచ్చు. అలాగే వినియోగదారులు తమ ముఖ్యమైన ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను సురక్షితంగా భద్రపరుచుకోవడానికి వీలుగా 50 జీబీ ఉచిత 'జియో ఏఐ క్లౌడ్' స్టోరేజీని ఇస్తున్నారు. ఈ సరికొత్త ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ నవంబర్ 7వ తేదీ నుంచి లభ్యం కానుంది. మై జియో యాప్, జియో అధికారిక వెబ్‌సైట్, జియో స్టోర్‌లతో పాటు ఇతర రిటైల్ ఔట్‌లెట్లలో కూడా ఈ రీఛార్జ్ సదుపాయం అందుబాటులో ఉంటుందని కంపెనీ ప్రకటించింది. భవిష్యత్తులో మొబైల్ టారిఫ్ ధరల పెరుగుదల భయం లేకుండా ఒకే రీఛార్జ్ తో ప్రశాంతంగా ఉండాలనుకునే వారికి ఈ ప్లాన్ ఎంతో అనుకూలమైనదిగా నిపుణులు చెబుతున్నారు.



1,718 పాయింట్లు
పెరిగిన సెన్సెక్స్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మదుపర్లకు కంటిచూపుతోనే లాభాల పండుగను మోసుకొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ, మన సూచీలు వాటిని అధిగమించి వరుసగా ఏడో రోజూ భారీ లాభాల్లో ముగిశాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కంపెనీలలో పెట్టుబడులు లేవనే కారణంతో ఇన్నాళ్లూ భారత స్టాక్ మార్కెట్‌కు దూరంగా ఉన్న విదేశీ మదుపర్లు, ఇప్పుడు అంతర్జాతీయంగా బలపడుతున్న 'యాంటీ ఏఐ' సెంటిమెంట్‌తో తిరిగి మన మార్కెట్లలో కొనుగోళ్లకు దిగడం సూచీలను విపరీతంగా పరుగులు తీయించింది. ఉదయం సెన్సెక్స్ 79,413.66 పాయింట్ల (క్రితం ముగింపు 79,310.01) వద్ద స్వల్ప లాభంతో ప్రారంభమైనప్పటికీ, కాసేపటికే కొనుగోళ్ల ఉద్ధృతితో ఇంట్రాడే గరిష్ఠాల దిశగా దూసుకెళ్లింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఏకంగా 1,718.01 పాయింట్లు ఎగబాకి 81,028.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 493.75 పాయింట్ల భారీ లాభంతో 25,030 వద్ద ల్యాండ్ అయింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.89గా నమోదైంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ మినహా మిగిలిన ప్రధాన స్టాక్స్ అన్నీ లాభాల్లో ముగియగా.. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అత్యధికంగా లాభపడి మార్కెట్ ర్యాలీకి నాయకత్వం వహించాయి.

అమెరికా మార్కెట్లు భారీ పతనం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అమెరికా స్టాక్ మార్కెట్లు నిలువునా కుప్పకూలాయి. ఫలితాల తర్వాత సంబరాలు చేసుకున్న మదుపర్లు తక్షణమే భారీ స్థాయిలో లాభాల స్వీకరణకు తెగబడటంతో సూచీలు క్రాష్ అయ్యాయి. ప్రధానంగా నాస్‌డాక్ ఏకంగా 5.52 శాతం పతనమై గత 19 నెలల్లోనే అత్యంత దారుణమైన రోజువారీ నష్టాన్ని చవిచూసింది. ఎస్అండ్‌పీ 4.36 శాతం, డోజోన్స్ 3.4 శాతం చొప్పున క్షీణించి గతేడాది ఏప్రిల్ నాటి స్థాయికి దిగజారాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్ చిప్ తయారీ రంగానికి చెందిన అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్, మైక్రాన్ టెక్నాలజీ, ఎన్విడియా వంటి కంపెనీల షేర్లు విపరీతంగా పడిపోయాయి. టెక్నాలజీ, ఏఐ ఆధారిత కంపెనీల వాల్యుయేషన్లు వాటి అసలు విలువ కంటే మించి పెరిగిపోయాయన్న ఆందోళనతో మదుపర్లు విక్రయాలకు మొగ్గు చూపారు. మరోవైపు అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల్లోనూ డెమోక్రాట్లు ఆధిపత్యం సాధించడమే మార్కెట్ల ఆందోళనకు ప్రధాన కారణమైంది. ఏఐ డేటా సెంటర్ల వేగవంతమైన విస్తరణ వల్ల తీవ్ర పర్యావరణ నష్టం వాటిల్లుతోందని, విద్యుత్ వినియోగం పెరిగిపోతోందని పలువురు డెమోక్రాట్ నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో కొత్త ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టులపై కఠిన నిబంధనలు, అంక్షలు అమల్లోకి రావచ్చునని ఇన్వెస్టర్లు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రభావంతో అమెరికా మార్కెట్ల పతనం కాస్తా ఆసియా మార్కెట్లనూ ముంచెత్తింది. జపాన్ నిక్కీ సూచీ 6 శాతానికి పైగా, దక్షిణ కొరియా కొస్పి సూచీ ఏకంగా 8 శాతం మేర పతనమై ఎరుపు రంగులోకి జారుకున్నాయి. ఈ రాజకీయ మార్పుల వల్ల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన టెస్లా, స్పేస్ఎక్స్ కంపెనీలకు అతిపెద్ద కోలుకోలేని దెబ్బ తగిలింది. కేవలం రెండు రోజు వ్యవధిలోనే ఈ కంపెనీల మార్కెట్ విలువ ఏకంగా 420 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.39



లక్షల కోట్లకు పైగా) తుడిచిపెట్టుకుపోయింది. మస్క్ బహిరంగంగా డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ఇవ్వడం, మధ్యంతర ఫలితాల్లో డెమోక్రాట్లు 'బ్లూవేవ్' దిశగా విజయం సాధించడంతో మస్క్ కంపెనీలపై విచారణలు, నిబంధనలు కఠినతరం కానున్నాయని భావిస్తున్నారు. ప్రాథమికంగా టెస్లా, స్పేస్ఎక్స్ విలీన ప్రయత్నాలు, ఏఐ ప్రాజెక్టులు, ప్రభుత్వ కాంట్రాక్టులకు అడ్డంకులు ఎదురుకావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మస్క్ భారీగా నిధులు వెచ్చించిన అభ్యర్థులు కూడా ఓడిపోవడం, ఆయన కంపెనీలు ఉన్న టెక్సాస్‌లో రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ తగలడంతో మార్కెట్లు తీవ్ర ప్రతికూలంగా స్పందించాయి.


సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
07.11.2026
www.manasarkar.com

తెలుగు బాక్సాఫీస్‌పై సూర్య గురి...

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్)

తమిళ స్టార్ సూర్యకు తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి అభిమాన గణం ఉంది. అయితే కొన్నేళ్లుగా వరుస పరాజయాలతో ఆయన మార్కెట్ కొంత తగ్గింది. 2024లో వచ్చిన 'కంగువ'తో పాటు 'రెట్రో' సినిమాలు తెలుగు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ ఏడాది 'కరుప్పు' (వీరభద్రుడు)తో కొంత ఊరట లభించగా, వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' మంచి వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాల అంచనా. దీంతో సూర్య మార్కెట్‌పై మళ్లీ నమ్మకం పెరిగింది. తాజాగా ఆయన నటించిన 'సీన్' నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా తెలుగు హక్కులను ఎన్‌వీఆర్ సినిమా సుమారు రూ.15 కోట్లకు దక్కించుకున్నట్లు సమాచారం. విడుదల ఖర్చులతో కలిపి బయ్యర్లు గట్టెక్కాలంటే రూ.2530 కోట్ల గ్రాస్ వసూళ్లు అవసరమని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. జీతూ మాధవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నజ్రియా కథానాయికగా, నస్లెన్ కీలక పాత్రలో నటించారు. మరి సూర్య క్రేజ్ ఈ లక్ష్యాన్ని అందిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.





ప్రమోషన్లలో వేగం పెంచాల్సిందే


ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్)

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, దర్శకధీరుడు రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న 'వారణాసి'పై అంచనాలు భారీగా ఉన్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి తదుపరి అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు మహేశ్ రుద్ర లుక్, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ పాత్రల పోస్టర్లతో పాటు కాన్సెప్ట్ వీడియో విడుదలైంది. 'సంచారి' పాట కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే సినిమా విడుదలకు ఐదు నెలల సమయమే ఉండటంతో ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాల పాటలతో ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి పెంచిన రాజమౌళి.. ఈసారి కూడా అదే వ్యూహాన్ని అనుసరిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. కీరవాణి వెల్లడించిన ప్రకారం ఈ సినిమాలో ఆరు పాటలు ఉండనున్నాయి. 'సంచారి' తర్వాత మహేశ్ మెలోడీ లేదా మాస్ పాటను విడుదల చేస్తే ప్రచారానికి మరింత ఊపు రావచ్చు. అలాగే రుద్ర పాత్రలో మహేశ్ యాక్షన్‌ను పరిచయం చేసే పవర్‌ఫుల్ టీజర్ వస్తే అంచనాలు మరోస్థాయికి చేరే అవకాశముంది.

2027లో రామ్ డబుల్ ధమాకా

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :


టాలీవుడ్ ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని వచ్చే ఏడాది రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది విడుదలైన 'ఆంధ్ర కింగ్ తాలూకా' ఆశించిన ఫలితాన్ని అందుకోకపోవడంతో ఈసారి విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మరోవైపు స్వయంగా దర్శకత్వం వహిస్తూ ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని తొలుత ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయాలని భావించినప్పటికీ.. షూటింగ్ ఆలస్యం కావడంతో వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 40 శాతం చిత్రీకరణ మాత్రమే పూర్తయినట్లు సమాచారం. 'ధర్మన్' షూటింగ్‌కు ప్రాధాన్యమివ్వడంతో సొంత చిత్రానికి కాస్త విరామం ఇచ్చారు. హడావుడిగా పూర్తి చేయడం కంటే నాణ్యమైన అవుట్‌పుట్ అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో 2026లో రామ్ సినిమా విడుదలయ్యే అవకాశాలు తగ్గాయి. 2027లో మాత్రం 'ధర్మన్'తో పాటు తన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రాన్ని కూడా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు సినిమాలు రామ్ కెరీర్‌కు ఎలాంటి మలుపునిస్తాయో చూడాలి.



అందానికి ఫిదా అవుతున్న అభిమానులు

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తెలుగు, తమిళ, హిందీ చిత్ర పరిశ్రమల్లో వరుస సినిమాలతో సందడి చేసిన కాజల్ అగర్వాల్.. పెళ్లి తర్వాత సినిమాల సంఖ్యను తగ్గించారు. అయినప్పటికీ, నటనకు పూర్తిగా దూరం కాకుండా అడపాదడపా చిత్రాల్లో కనిపిస్తున్నారు. 'లక్ష్మీ కల్యాణం'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె.. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'మగధీర'తో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత అగ్ర హీరోల సరసన నటిస్తూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తాజాగా 'రామాయణం' సినిమాతో మరోసారి వార్తల్లో నిలిచారు. ఇందులో రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. రాణి వేషధారణలో ఆమె లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'మగధీర' విడుదలై 17 ఏళ్లు గడుస్తున్నా కాజల్ అందంలో ఎలాంటి మార్పు లేదంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మొత్తంగా మండోదరి పాత్రతో కాజల్ మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు.



డాక్టర్ పట్టా.. సినీ బిజీ...

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

డాక్టర్ కావాలనుకుని సినీ నటిగా మారిన శ్రీలీల.. అటు చదువులోనూ, ఇటు నటనలోనూ తన ప్రతిభ చాటుకుంటున్నారు. సినిమాల చిత్రీకరణలో బిజీగా ఉంటూనే సమయం దొరికినప్పుడల్లా చదువుపై దృష్టి పెట్టి వైద్య విద్యను పూర్తి చేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. 2019లో కన్నడ చిత్రం 'కిస్'తో వెండితెరకు పరిచయమైన ఆమె.. 'పెళ్లి సందD'తో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. రవితేజ సరసన నటించిన 'ధమాకా'తో తొలి భారీ విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'భగవంత్ కేసరి', 'గుంటూరు కారం', 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్', 'రాబిన్‌హుడ్', 'మాస్ జాతర' తదితర చిత్రాల్లో నటించారు. 'పుష్ప 2'లో ప్రత్యేక గీతంతోనూ అలరించారు. ప్రస్తుతం రజనీకాంత్ నటిస్తున్న 'ధర్మన్'తో పాటు బాలీవుడ్ అవకాశాలపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు సామాజిక మాధ్యమాల్లోనూ చురుగ్గా ఉండే ఈ భామ తాజాగా దీపావళి ప్రత్యేక కార్యక్రమంలో ధరించిన వెండి రంగు లెహంగా దుస్తుల్లో మెరిశారు. ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్రా రూపొందించిన ఈ దుస్తుల్లో సంప్రదాయ, ఆధునిక శైలుల కలయిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



నా రూపం నాకే నచ్చేది కాదు

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

టాలీవుడ్ హీరోయిన్ పూజా హెగ్డే తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాజాగా ఓ బ్రాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. ఒకప్పుడు తన రూపం తనకే నచ్చేది కాదని తెలిపారు. ముఖ్యంగా ముఖంలోని ముక్కు, నవ్వు అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదని చెప్పారు. ఈ విషయాన్ని తండ్రి వద్ద ప్రస్తావించినప్పుడు ఆయన ఇచ్చిన సమాధానం తన ఆలోచనా విధానాన్ని మార్చిందన్నారు. 'దేవుడు నీ ముఖానికి ఏ ముక్కు సరిపోతుందో అదే ఇచ్చాడు. పెద్ద ముక్కు ఉంటే నీ ముఖం ఎలా ఉంటుందో ఊహించుకో' అని తండ్రి చెప్పిన మాటలు తనకు ఎంతో అవగాహన కల్పించాయని గుర్తుచేసుకున్నారు. మనలోని లోపాల గురించి అతిగా ఆలోచిస్తూ మనల్ని మనమే తక్కువ చేసుకోవడం మంచిది కాదన్నారు. ఒకప్పుడు తనకు నచ్చని ముక్కు, నవ్వునే ఇప్పుడు ప్రేక్షకులు ఇష్టపడుతున్నారని తెలిపారు. అందుకే మనల్ని మనం అంగీకరించుకోవడం, ప్రేమించుకోవడం ముఖ్యమని పూజా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



హనీట్రాప్ దోపిడీ కేసు

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

కేరళలోని కొచ్చిలో సంచలనం సృష్టించిన హనీట్రాప్ దోపిడీ కేసులో నటి అతుల్య చంద్ర, నటుడు, నిర్మాత బిబిన్ పెరుంబిల్లిని పోలీసులు అరెస్టు చేశారు. 'మత్తువదలరా' చిత్రంతో గుర్తింపు పొందిన అతుల్య చంద్ర ఈ కేసులో నిందితురాలిగా ఉండటం చర్చనీయాంశమైంది. వైద్య సాయం పేరుతో ఓ యువ డాక్టర్‌ను అపార్ట్‌మెంట్‌కు పిలిపించి దాడి చేసి, రూ.3.5 లక్షల విలువైన వస్తువులు దోచుకున్నట్లు ఆరోపణలున్నాయి. కొచ్చిలోని ఎసెన్ స్ప్రింగ్‌డేల్ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడికి చేరుకున్న వైద్యుడిపై అత్యాచార ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు దిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బిబిన్‌తో పాటు మరికొందరు ఆయనపై దాడి చేయగా, అతుల్య చంద్ర మొబైల్ ఫోన్, స్మార్ట్‌వాచ్, ఇయర్‌ఫోన్స్ తీసుకున్నట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదుతో కడవంత పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 12 మందిని నిందితులుగా గుర్తించగా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన వెనుక హనీట్రాప్ కోణం ఉందా? అన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**